Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

బుధవారం, జూన్ 10, 2026 | సంపుటి - 20 | సంచిక 259 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## హెచ్1బి వీసాపై ట్రంప్‌కు షాక్



### లక్ష డాలర్ల ఫీజుపై కోర్టు కొట్టివేత

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం 2లో

# ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం
- పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని బిఆర్ఎస్ ఆలోచించలేదు
- ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు 76వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరలకు కొంటున్న ఘనత మాదే
- జనగామ జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రివర్గం 18 గంటలు పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఏదో ఒక అభాండం వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. పేదలకు చెందాల్సిన సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని ఆరోపించారు. మంగళవారం నాడు జిల్లాలోని చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన భట్టి.. 33/11కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.**



జనగామ : పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం ఆపడం లేదని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్పోరేట్ శక్తుల దయాదక్షిణ్యాల కోసం రైతులు ఎదురు చూసేలా కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ వడ్ల కొనుగోళ్లు జరగడం లేదన్నారు. తాము మొక్కజొన్నలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కమ్‌లకు డబ్బులు చెల్లించలేదన్నారు. కానీ ఇప్పుడు డిస్కమ్‌లకు డబ్బులు చెల్లిస్తున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా నేను, సీఎం ఇక్కడి ప్రజలకు హామీలు ఇచ్చాం. తరువాయి 2లో



## మోహన్ నాయక్ ఆస్తులు వందకోట్లకు పైగానే

**ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇంట్లో సొదాలు**

**భారీగా బంగారం, నగదు, ఆస్తులు గుర్తించిన ఏసిబి**

**కిలో బంగారం, 60 లక్షల నగదు స్వాధీనం**

హైదరాబాద్ : ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో రోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసంతో



పాటు ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఉదయం నుంచి తనిఖీలు కొనసాగాయి. మోహన్ నాయక్ ఈఎన్‌సీ హోదాలో ఉన్న సమయంలో వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

తరువాయి 2లో



## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

### మీడియా సమావేశంలో బిజెపి అధ్యక్షుడు

భువనగిరి : తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ ఇస్తుందని స్పష్టంచేశారు. దేశవ్యాప్త ధాన్యం సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ 2లో





## పదేళ్ల బిఆర్ఎస్‌లో అభివృద్ధి శూన్యం

**పేదల ఆశలు నెరేవరుస్తున్న ప్రజా ప్రభుత్వం**

**అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన పొంగులేటి**

గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ , జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్ , డైట్ ఛార్జీల పెంపు వంటి నిర్ణయాలతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం : పేదవాడి ఆత్మ గౌరవం కోసం రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అందులో కేవలం అశ్వా రావుపేట నియోజకవర్గానికే నాలుగు వేల ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్ల డించారు. చివరి పేదవాడి వరకూ లబ్ది చేకూరుస్తామని చెప్తూ, భూమి లేని పేద ఆడబిడ్డల కోసం ఐదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటు తరువాయి 2లో



## సింగరేణిని కాపాడాల్సింది ప్రభుత్వమే

**ప్రభుత్వమే దోచుకుంటూ పోతే ఎలా**

**బొగ్గు నిల్వలను మంత్రి శ్రీధర్ బాబు చూపించాలి**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్**

హైదరాబాద్ : సింగరేణి సంస్థ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. కానీ ఆ సంస్థను ప్రభుత్వమే దోచుకుంటుందని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన 26 లక్షల 28 వేల మెట్రిక్ టన్నులు 2లో

## నైరుతితో పలకరించిన తొలకరి

**హైదరాబాద్ నగరంలో ఉరుములతో భారీ వర్షం**

**ఎప్పటిలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం**

**అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక**



హైదరాబాద్ : తొలకరి పలకరించింది. నైరుతి ప్రవేశంతో హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు రామ్‌నగర్‌లోని వీఎస్టీ రోడ్డులో తరువాయి 2లో



## విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

**ఘటనపై ముగ్గురు నిపుణులతో కమిటీ ఏర్పాటు**

**బాధితులను పరామర్శించిన డిప్యూటి సిఎం పవన్**

విశాఖపట్నం : విశాఖ ఉక్కు కర్మాగారంలో మెటల్ లిక్విడ్ లాడిల్ పేలి ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం విశాఖకు చేరుకున్న ఆయన, మొదట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం స్టీల్ ఎ-లాంట్ పరిధిలోని ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, యాజమాన్యంతో మాట్లాడారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘోర ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు కోసం ముగ్గురు నిపుణులతో కూడిన తరువాయి 2లో

## డిజిలైటేజషన్, ఎఐలదే కీలక భూమిక

### విద్యార్థులను సవాళ్లకు సన్నద్ధం చేయాలి

### టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ సాగాలి

### విక్రమ సింహపురి స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల నజీర్ పిలుపు



నెల్లూరు : ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యా సంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందు బాటులోకి రావాలంటే డిజిటల్ విద్యను విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. మంగళవారం నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ సభకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్వవిద్యాలయం గత పదిహేడేళ్లుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. 2లో

## స్టీల్ ప్లాంట్ బాధితులకు అండగా ఉంటాం

**బాధిత కుటుంబాలకు లోకేశ్ పరామర్శ**

**అధికారుల నుంచి ప్రమాద వివరాలు ఆరా**



విశాఖపట్నం : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. మంగళవారం ఉదయం కేజీహెచ్ ఆస్పత్రికి చేరుకున్న మంత్రి.. మార్చురీలో ఎంతమంది ఉన్నారనే దానిపై జాయింట్ కలెక్టర్ విద్యాధరిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చనిపోయిన ఎమినిది మంది బంధువులను పరామర్శించారు. వారి నుంచి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపై సెవెన్ హిల్స్ ఆస్పత్రికి మంత్రి వెళ్లారు.

తరువాయి 2లో

## హెచ్1బి వీసాపై ట్రంప్‌కు షాక్

నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని, చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ టెక్కీలకు పెద్ద ఊరట లభించింది.

## విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, త్వరలోనే ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు.ఆస్పత్రిలో ఉన్న క్షతగాత్రుల వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పవన్ కల్యాణ్ కీలక ప్యాకేజీని ప్రకటించారు. ప్రమాదంలో మరణించిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు రూ. 45.75 లక్షల పరిహారంతో పాటు, మృతుల కుటుంబాలకు అదనంగా రూ. 25 లక్షల సహాయం అందజేస్తామన్నారు. అంతేకాకుండా, స్టీల్ ఎ÷-లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఎవరూ నివాసాల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి కార్మికుడు తమ రిటైర్మెంట్ వరకు స్టీల్ ఎ÷-లాంట్ క్వార్టర్స్ లోనే కొనసాగేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## స్టీల్ ప్లాంట్ బాధితులకు అండగా ఉంటాం

స్టీల్ ఎ-లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూరిబాబు, పైడిరాజు, పి.శ్రీనివాసరావు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని, ఆసుపత్రిలో అందుతున్న చికిత్సను వైద్యులను అడిగి తెలుసుకున్నారు . అనంతరం గాయపడిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని లోకేశ్ చెప్పారు. మంత్రి లోకేశ్‌తో పాటు కేంద్రమంత్రి భూపతి రాజు, హోంమంత్రి అనిత, ఎంపీ భరత్, పల్లా శ్రీనివాసరావు.. వాసంసెట్టి బాధితులను పరామర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగింది. లాడిల్ నుంచి ద్రవ ఉక్కు బకెట్లు కింద పడిపోయాయి. పలువురు కార్మికులపై ద్రవ ఉక్కు పడి అక్కడికక్కడే బూడిదయ్యారు. ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా మారాయి. అటు ఎనిమిది మృతదేహాలను పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు మృతుల బంధువుల శాంపిల్స్‌ను తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామని వైద్యులు చెబుతున్నారు. డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యేందుకు నాలుగు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు విశాఖలోని కిమ్స్, సెవెన్ హిల్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

## సింగరేణిని కాపాడాల్సింది ప్రభుత్వమే

బొగ్గు ఉందని సింగరేణి అధికారులు వెల్లడించారని ఆయన వివరించారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11.00 గంటలకు ఆ బొగ్గు నిల్వలను చూపించాలని మంత్రి శ్రీధర్ బాబును.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. 3 లక్షలకు పైగా బొగ్గు నిల్వ ఉందన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాను, మంత్రి శ్రీధర్ బాబు.. ఇద్దరమే అక్కడికి వెళ్తామన్నారు. బొగ్గు నిల్వ లేకపోతే తప్పు చేశామని ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సింగరేణి విషయంలో జోక్యం చేసుకోలేదని గుర్తు చేశారు. సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సింగరేణిలో ఆయన వేలు పెట్టారని స్పష్టం చేశారు. రెండు, మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేని పరిస్థితి సింగరేణిలో నెలకొందన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు మాట్లాడలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. సింగరేణిలో 26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుపై సీబీసీఐడీతో విచారణ జరిపేలా ఆదేశించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. రూ.4 వేల కోట్ల ఓవర్ డ్రాఫ్ట్ ఎందుకు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డితోపాటు బండి సంజయ్ కూడా బాధ్యత వహించాల్సి ఉందన్నారు. గతంలో సింగరేణిలో 20 వేల ఉద్యోగాలు ఉండే.. కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కారుణ్య నియామకాలు కింద 16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. దీంతో ఆ సంస్థలోని 36 వేల మంది ఉద్యోగులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. బొగ్గు లేకుండా ఎందుకు ఆదాయపు పన్ను కట్టారో చెప్పాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.

## ఓజి గంజాయి స్మగ్లింగ్ ముఠా బట్టబయలు

### జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరి కళ అరెస్ట్

హైదరాబాద్ : హైదరాబాద్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను ఈగల్ ఫోర్స్ తెలంగాణ, కస్టమ్స్ విభాగం, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్తంగా ఛేదించాయి. బ్యాంకాక్- ఇండియా మార్గంలో సాగుతున్న ఓజి గంజాయి స్మగ్లింగ్ ముఠాను బట్టబయలు చేసి కీలక నిందితులను గుర్తించారు. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరి కళను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 2.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న సమయంలో కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా ఈ డ్రగ్స్ బయటపడ్డాయి. కేరళకు చెందిన చల్లిల్ పుత్తన్‌పురయిల్ నష్ఫీద్ అలియాస్ అలెక్స్ ఈ ముఠాకు ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. మహిళా జూనియర్ ఆర్టిస్టులను లక్ష్యంగా చేసుకుని ఒక్కో ట్రిప్‌నకు రూ.20 వేల వరకు పారితోషికం ఇస్తామని ఆశ చూపించి వారిని డ్రగ్స్ రవాణాకు వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో మరికొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2026 మార్చిలో సూరి కళ మొదటిసారి బ్యాంకాక్‌కు వెళ్లి అక్కడి నుంచి గంజాయిని తీసుకువచ్చి చెన్నైలో ముఠా సభ్యులకు అప్పగించినట్లు తేలింది. అనంతరం ఏప్రిల్ 2026లో మరోసారి బ్యాంకాక్ వెళ్లి మాదకద్రవ్యాలను భారత్‌కు తీసుకువచ్చి హైదరాబాద్‌లో అందజేసినట్లు గుర్తించారు. జూన్ 2026లో మూడోసారి అదే తరహా ప్రయత్నం చేస్తుండగా శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు.. జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరి కళను పట్టుకున్నారు. దీంతో అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠాలో రాజు బిస్వాస్ అనే వ్యక్తి కూడా కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. అలాగే గంగా భవాని, గౌరి అనే మరో ఇద్దరు మహిళలను కూడా బ్యాంకాక్‌కు పంపించి గంజాయి రవాణా చేయించినట్లు అధికారులు గుర్తించారు. మహిళా ఆర్టిస్టులను ఎరగా వేసుకుని అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ నిర్వహిస్తున్న ఈ ముఠాపై అధికారులు మరింత సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరికొంతమంది సభ్యులు, ఆర్థిక లావాదేవీలు, విదేశీ సంబంధాలపై విచారణ కొనసాగుతోంది. 2.15 కిలోల క్షఉ గంజాయి స్వాధీనం కావడంతో పాటు అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్‌కు సంబంధించిన కీలక ఆధారాలు కూడా లభించినట్లు అధికారులు తెలిపారు.

# ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం' అని భట్టి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు.. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని.. కానీ ఇప్పుడు అభివృద్ధి జరుగుతోందన్నారు. రఘునాథపల్లిలో 230ఐ÷ఎ సబ్ స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.14వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదు? రాష్ట్రం సేకరించిన మొక్కజొన్నను కూడా కేంద్రం కొనుగోలు చేయాలి. 30 లక్షల పంపుసెట్ల విద్యుత్తు బిల్లులు రూ.14వేల కోట్లు డిస్కమ్‌లకు చెల్లిస్తున్నాం. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.5వేల కోట్లు చెల్లిస్తున్నాం. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నాం. దేవాదుల ప్రాజెక్టును గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దేవాదులకు నిధులు మంజూరుతో పనులు వేగంగా సాగుతున్నందున ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు రూ.22వేల కోట్ల రుణమాఫీ చేశాం అని వివరించారు.

## మోహన్ నాయక్ ఆస్తులు వందకోట్లకు పైగానే

ఈ క్రమంలో హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో మొత్తం 11 చోట్ల ఏకకాలంలో దాడులు చేపట్టారు. మియాపూర్ లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న విల్లా నంబర్-98లో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. భద్రతా కారణాల దృష్ట్యా అధికారుల అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించ లేదు. సోదాల సందర్భంగా పలు కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదు, బంగారు ఆభరణాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం ప్రకారం.. రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు మోహన్ నాయక్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించే ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. సోదాలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి లెక్కలు, స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువపై అధికారిక వివరాలు వెల్లడించాల్సి ఉంది. సాయంత్రం వరకు ఈ తనిఖీలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సోదాలు పూర్తయిన అనంతరం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ వెల్లడించనున్నారు. మోహన్ నాయక్ ఇంటితోపాటు 15 ప్రాంతాల్లోని ఆయన బంధువుల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అతడి ఇంట్లో 20కి పైగా విదేశీ మద్యం సీసాలను గుర్తించారు. మంగళవారం ఉదయం నుంచి తనిఖీలు కొనసాగుతున్నాయని, సోదాలు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. మోహన్ నాయక్ ఇంట్లో చేపట్టిన తనిఖీల్లో రూ.60లక్షల నగదు గుర్తించినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. కిలో బంగారు నగలు, 13 బంగారు బిస్కెట్లు గుర్తించినట్లు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్‌లో ఇళ్ల స్థలాల పత్రాలు గుర్తించామని తెలిపారు. మరోవైపు, మోహన్ నాయక్ కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు జరిపింది. ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో పలు ఫైళ్లను తనిఖీ చేస్తున్నారు. అక్కడి అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు. అతడి ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.

## నైరుతితో పలకరించిన తొలకరి

భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే, హైదర్‌గ.ూడలోనూ ఓ భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పలుచోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. భాగ్యనగరంలో భారీ వర్షం కురుస్తోండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా లోతట్టు కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లలో నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా, కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అయింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు మరికొన్ని గంటల పాటు నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణలో బుధవారం కూడా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపిన వాతావరణ శాఖ అధికారులు.. కామారెడ్డిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

## డిజిలైటేజషన్, ఎఐలదే కీలక భూమిక

విశ్వవిద్యాలయం ఇటీవల నాక్ నుంచి 3.23 సీజీపీఏతో 'ఎ' గ్రేడ్ సాధించడం గర్వకారణమని ప్రశంసించారు. ఈ విజయంతో జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలను సాధించే సామర్థ్యం విశ్వవిద్యాలయానికి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రస్తావించారు. డీప్ ఓషన్ మిషన్ కార్యక్రమం కింద మెరైన్ బయాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల గ్రాంట్ లభించడం విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త అవకాశాలను కల్పించిందని వివరించారు. ఈ నిధుల ద్వారా పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విద్య, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతమిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న జాతీయ సేవా పథకం కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కాలేజ్- టు - విలేజ్, ల్యాబ్ - టు - ల్యాండ్ వంటి కార్యక్రమాలను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. అప్పుడు ప్రపంచం కూడా మీకు అత్యుత్తమ అవకాశాలు, గుర్తింపు, విజయాలను తిరిగి అందిస్తోందని తెలిపారు. యువత పెద్ద కలలు కనాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించగలరని చెప్పుకొచ్చారు. విద్యే సమాజ మార్పునకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని ఉద్ఘాటించారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించే వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సదస్సులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ జ్ఞానం, నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

## మహిళా సాధికారతకు మరో అడుగు

### మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ

### బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు

### పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జూన్9 : మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్నీ కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్య్రం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రాంచందర్ రావు ఆరోపించారు.

## పదేళ్ల బిఆర్ఎస్‌లో అభివృద్ధి శూన్యం

చేస్తున్నామని వివరించారు. నాడు కేవలం పింక్ కలర్ పార్టీ వారికి మాత్రమే అందిన లబ్ధి, నేడు ప్రతి పేదవాడికి చేరుతోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలో మార్పుల గురించి ప్రస్తావిస్తూ అశ్వారావుపేటలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ కులమతాలకు, పేద ధనిక తారతమ్యం లేకుండా సుమారు 2300 మంది విద్యార్థులు చదువుకుంటారని చెప్పారు. దీనితో పాటు త్వరలోనే ఇక్కడ అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్‌ను కూడా తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అశ్వారావుపేటకు వంద పడకల ఆసుపత్రిని, నర్సింగ్ కాలేజీని మంజూరు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. స్థానికంగా కొమురం భీమ్ అర్బన్ పార్క్ ప్రారంభం, పూసుకుంట కొండ రెడ్ల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ పేదవాడి ప్రభుత్వమని, భవిష్యత్తులో ప్రజలందరి ఆకాంక్షలను నెరవేరుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు , పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికుల దుర్మరణం

హైదరాబాద్,జూన్ 9 : దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ బస్సు, ట్రక్కు ఢీ కొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులతో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే..దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతిగా గుర్తించారు. గాయపడిన వారిలో హైదరాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ సయీద్ కూడా ఉన్నాడు. వీరందరూ షార్జా కేంద్రంగా పని చేస్తున్న అల్యూమినియం గ్లాస్, డోర్ ఫ్రేమ్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న భారత కాన్సులేట్ అధికారులు బాధితులను పరామర్శించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాసరలో విషాద ఘటన

### గోదావరిలోకి దిగి ముగ్గురు గల్లంతు

### మైదరాబాద్‌కు చెందిన అన్నదమ్ములుగా గుర్తింపు

నిర్మల్,జూన్ 9 : బాసరలో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి వెళ్లిన ముగ్గురు భక్తులు ప్రమావదశాత్తూ గోదావరి నదిలో గల్లంతయ్యారు. హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్‌కు చెందిన ఓ కుటుంబం.. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి వెళ్లారు. అయితే, దర్శనానికి ముందు పుణ్యస్నానాలు ఆచరించేందుకు కుటుంబ సభ్యులు గోదావరి నదిలోకి దిగారు. లోతును సరిగ్గా అంచనా వేయలేకపోవడంతో బాధిత కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. కాగా, గల్లంతైన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31) అన్నదమ్ములుగా తెలుస్తోంది. ఈ ప్రమాదాన్ని గమనించిన గజ ఈతగాళ్లు.. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అన్నదమ్ములు ముగ్గురు నీటిలో మునిగిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారిని సురక్షితంగా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు. మరోవైపు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి బయలుదేరారు.

# కాంగోను వణికిస్తున్న ఎబోలా

## ఇప్పటికే 101 మంది మృత్యువాత

న్యూఢిల్లీ : మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్య అధికారులు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రకారం.. కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా.. 19 మంది కోలుకున్నారు. మరో 309 మంది ఎబోలా అనుమానితులు ఐసోలేషన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే ఇటురి, నార్త్ కిపులలో 35 కొత్త కేసులు నమోదవగా, మరో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత పెరుగుతోందని, కొన్నిరోజుల తర్వాత తీవ్రత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధరణ.. వైరస్‌కు సరైన టీకా, చికిత్స లేకపోవడం సవాళ్లుగా మారాయని తెలిపారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయంగా ఈ వ్యాధి మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక, ఉగాండాలో 19 ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. కాగా.. రెండు మరణాలు చోటుచేసుకున్నాయి.

# గంజాయి పార్టీ పై పోలీసుల దాడి

## పాతబస్తీకి చెందిన ఆయుర్వేద డాక్టర్ అరెస్ట్

హైదరాబాద్,జూన్ 9 : నగరంలోని పాతబస్తీ చంద్రాయణగుట్ట బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి పార్టీపై పోలీసులు దాడులు చేశారు. క్రిస్టల్ టౌన్‌షిప్‌లోని ఓ ఇంటిలో గంజాయి పార్టీ జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి... ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 220 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడుల్లో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు అతౌల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మెడికల్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు.

# మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు

## మొహర్రం ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష

## రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,జూన్9 : ఈనెల 16న జరగనున్న మొహర్రం ఊరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తో కలిసి వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు తాగు నీటి సరఫరా చేయాలని, జి.హెచ్.ఎం.సి అధికారులు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ అండ్ బి అధికారులు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ–కా–ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీం కురేషీ, చార్మినార్, బహదూర్‌పురా, యాకత్ పురా, నాంపల్లి, కార్వాన్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు, మీర్ జుల్ఫెకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మీర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్, మైనారిటీ ÷నాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్(ఊఓచాః) ఎండీ అశోక్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, వక్ఫ్ బోర్డు అఇక్ష తదితరులు పాల్గొన్నారు.



# పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి అధోగతి

## ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి

## 14 రకాల నిత్యావసరాలు అందచేయాలి

## సివిల్ సప్లై కార్యలయం ఎదుట ఐద్వా ధర్నా




హైదరాబాద్,జూన్9 : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లు లక్ష్మి మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు, పాఠశాల ఫీజులు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల కారణంగా కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1 కోటి 5 లక్షల 42 వేల 188 బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్నాయని, వాటి పరిధిలో 3 కోట్ల 39 లక్షల 96 వేల 239 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికి ఆరు కిలోల బియ్యం మాత్రమే అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే బియ్యంతో పాటు పప్పులు, వంటనూనెలు, మొక్కజొన్నలు, చక్కెర, కారం, పసుపు, జీలకర్ర, పామాయిల్, కొబ్బరి నూనె, ఆవాలు, జొన్నలు, పల్లీలు, సబ్బులు వంటి మొత్తం 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల అనేక కుటుంబాలు పోషకాహారాన్ని తీసుకోలేకపోతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య అధికమవుతోందని మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పోషకాహారం అందక చిన్నారులు కూడా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఆశలత, కె. నాగలక్ష్మి, పి. శశికళ, వై. వరలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బట్టుపల్లి అనూరాధతో పాటు మహిళా నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

## మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా

## 8 లక్షల మేట్రిక్ టన్నుల మొక్క జొన్న కొనుగోలు

## హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి

## ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహి విమర్శలు

## మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయన్న ఎన్‌డీఎస్‌ఏ

## మీడియా సమావేంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జూన్9 : తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్టాల్లో్ర డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రోక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ ఆబద్ధాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు. 8 లక్షల మేట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్టాల్లో్ర ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ పక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని.. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ధాన్యం కొనుగోలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని దుష్ప్రచారం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీరుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ నేతలు ఇక్కడ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్ధాలేనని మండిపడ్డారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరామని.. కానీ కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా బాధ్యతగా ధాన్యం కొనుగోలు చేయలేదని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలనే అంశంపై.. దేశంలో వివిధ రాష్టాల్లో్ర ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో హమాలీల సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించారు. మోస్ట్ అడ్వాన్స్ మోడరైజేషన్ సిస్టం తేవాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న స్టోరేజ్ సరిపోవట్లేదని తెలిపారు.

# భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు...

## స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం

## పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు

## 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,జూన్9 : భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్టాల్రకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్–టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్–టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా... మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. అందుకు... పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్ ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్టాన్రికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు.

# మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బిఆర్ఎస్

## ఫ్రీ బస్సు తీసుకొస్తే కళ్లల్లో నిప్పలు పోసుకున్నారు

## మంత్రి సీతక్క ఘాటు విమర్శలు

హైదరాబాద్,జూన్9 : మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కాంగ్రెస్ సర్కార్ కోరుకుంటే బీఆర్ఎస్ ఏడుస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. మహిళలు ఎదిగితే బీఆర్ఎస్ ఓర్వలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఫ్రీ బస్ స్కీమ్ తీసుకొస్తే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని బీఆర్ఎస్ పై ఫైర్ అయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ప్రభుత్వం మహిళా శక్తి సభ నిర్వహించింది. మంత్రి సీతక్క ఈ సభకు హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తెలిపారు. రూ.2 వేల కోట్ల వడ్డీ డబ్బులను ప్రభుత్వమే చెల్లిస్తుదని చెప్పారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మూడు వేలకు పైగా మహిళా సంఘాలకు ఐకేపీ సెంటర్లు ఇచ్చామని.. వీటి ద్వారా ఆడబిడ్డలకు గతేడాది రూ.159 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో చదువుకోని 12 లక్షల మంది మహిళలకు చదువు చెప్పిస్తున్నామన్నారు. 60 ఏళ్లు దాటిన మహిళలను కూడా మహిళా సంఘాల్లో చేర్చుతున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచానికి చూపిస్తున్నామని అన్నారు.

# బాసర గోదావరిలో ముగ్గురి గల్లంతు

## గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలు వెలికితీత

## మృతులు హైదరాబాద్ వాసులుగా గుర్తింపు

నిర్మల్,జూన్9 : నిర్మల్ జిల్లా బాసరలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తూ మంగళవారం గల్లంతయ్యారు. సాయంత్రం వారి మృతదేహాలు బయట పడ్డాయి. ఈ ఘటనతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం కోసం ఇవాళ వచ్చారు. దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తుండగా ముగ్గురు సోదరులు నీటిలో మునిగిపోయారు. మాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లతో రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. కొన్ని గంటల పాటు గాలించాక.. ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు గజ ఈతగాళ్లు. మృతులను చెందిన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31)గా గుర్తించారు. ముగ్గురూ సొంత అన్నదమ్ములేనని అధికారులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు ఒకేసారి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన బాసర, కాచిగూడలో తీవ్ర విషాద ఛాయలు నింపగా, స్థానికులను కూడా కలచివేసింది. గోదావరి నదిలో స్నానాలు చేసే సమయంలో భక్తులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, లోతైన ప్రాంతాలకు వెళ్లవద్దని పోలీసులు సూచించారు.

# పెట్రోల్ ధరలు పెరుగుతున్నా నష్టాల్లోనే చమురు కంపెనీలు..

## రోజుకు రూ.700 కోట్ల నష్టం



దేశంలో ఒకపక్క పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెరుగుతున్నాయి. ఈ ధరలు సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. ప్రజల జేబులకు చిల్లులు పెడుతూ చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ చమురు కంపెనీలు నష్టాల బాటలోనే కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం రంగ చమురు కంపెనీలు భారీ నష్టాలు పొందుతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశంలో కొంతకాలం చమురు ధరలుపెరగలేదు. ఇటీవలి కాలంలో మాత్రం ఈ ధరలు పెరుగుతున్నాయి. ఎల్పీజీపై సగటును ఒక లీటర్‌కు రూ.7.50 ధర పెరిగింది. అయినప్పటికీ కంపెనీలు మాత్రం నష్టాల బాటలోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ప్రస్తుతం ప్రతిరోజూ ఒక లీటర్ డీజిల్‌పై రూ.30. పెట్రోల్‌పై రూ.6 వరకు నష్టపోతున్నాయి. ఏప్రిల్ 1 నాటి చమురు ధరల ప్రకారం.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర పెరిగినప్పటికీ దేశంలో ఆయిల్ ధరలు పెరగలేదు. అప్పట్లో ఒక లీటర్ పెట్రోల్‌పై రూ.24, డీజిల్‌పై రూ.105 వరకు నష్టం వచ్చిందని కంపెనీలు చెబుతున్నాయి. దీంతో కంపెనీలపై తీవ్ర ఆర్థిక భారం పడింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చమురు ధరల్ని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయినప్పటికీ చమురు కంపెనీలు నష్టాల్లోనే కొనసాగుతున్నాయని కేంద్ర చమురు, సహజవాయువు శాఖ అదనపు కార్యదర్శి ప్రవీణ్ ఖనూజ వెల్లడించారు. ప్రస్తుతం చమురు కంపెనీలు ప్రతి రోజూ సగటున రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు నష్టపోతున్నాయన్నారు. ముఖ్యంగా వంట గ్యాస్ సిలిండర్లపై ఎక్కువ నష్టం వస్తోందన్నారు. 14.2 కేజీల బరువు ఉండే గృహ సిలిండర్‌పై రూ.700 వరకు నష్టం వస్తోంది. కంపెనీలకు తయారీ, నిర్వహణ ఖర్చులకు, వినియోగదారుడు చెల్లించే డబ్బులకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఖనూజా తెలిపారు. ఇంత నష్టం వస్తున్నప్పటికీ గృహ వినియోగదారులపై భారం పడకూడదని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. నిజానికి ఇప్పుడు గృహ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,600 వరకు ఉంటుందని, కానీ, కేంద్రం తక్కువ ధరకే అందిస్తోందని చెప్పారు. ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.942 ఉండగా, కేంద్రం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం కింద పేదలకు రూ.300 సబ్సిడీ ఇస్తోంది. దీంతో వారికి సిలిండర్ రూ.642కే లభిస్తోంది. ఇటీవల గల్ఫ్ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి మన దేశానికి చమురు అందించే సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్ (సీపీ) ధర 46 శాతం పెరిగింది. హార్ముజ్ జలసంధి మూసివేయడం, చమురు సరఫరా రవాణాకు ఆటంకాలు ఏర్పడటం కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగాయి. కేంద్ర పథకాల్లో కోత.. పేదలకు కేంద్ర ప్రభుత్వం పీఎంయూవై కింద ఒక కుటుంబానికి ఏడాదికి 9 సిలిండర్లు గతంలో ఇచ్చేది. కానీ, ఇప్పుడు చమురు సంక్షోభం కారణంగా ఈ సిలిండర్ల సంఖ్యను కేంద్రం తగ్గించింది. ఇకపై ప్రతి ఏడాది ఒక కుటుంబానికి గరిష్టంగా నాలుగు సిలిండర్లు మాత్రమే పీఎంయూవై కింద సబ్సిడీతో ఇవ్వనుంది. సాదారణంగా ఒక కుటుంబానికి ఏడాదికి 4 నుంచి 5 సిలిండర్లు సరిపోతాయని కేంద్రం అంటోంది. అందుకే సబ్సిడీ సిలిండర్ల సంఖ్యను తగ్గించింది. ఇదే సమయంలో సబ్సిడీ మొత్తాన్ని కేంద్రం తగ్గించలేదు. ప్రస్తుతం ఎల్పీజీ సిలిండర్లకు డిమాండ్ బాగా పెరిగింది. దీనికి అనుగుణంగా కంపెనీలు చమురు ఉత్పత్తిని కూడా పెంచుతున్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం 60 శాతం ఉత్పత్తి పెరిగింది.పెట్రోల్ ధరలు పెరుగుతున్నా నష్టాల్లోనే చమురు కంపెనీలు.. రోజుకు రూ.700 కోట్ల నష్టం్ౖరావేతీశశ్రీ్ౖరాతీఅఎవం : దేశంలో ఒకపక్క పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెరుగుతున్నాయి. ఈ ధరలు సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. ప్రజల జేబులకు చిల్లులు పెడుతూ చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ చమురు కంపెనీలు నష్టాల బాటలోనే కొనసాగుతున్నాయి.

# సంపాదకీయం

## ట్రంప్‌కు వీసా దెబ్బ !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రయాపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# యువత మనసు గెలిచిన 'సిజెపి'






జూన్ 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన భారీ యువజన సమీకరణం సమకాలీన భారత రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా నిలిచింది. ఆన్‌లైన్ వ్యంగ్య వేదికగా ప్రారంభమైన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) అతి తక్కువ సమయంలోనే వేలాదిమంది యువతను వీధుల్లోకి తీసుకురాగల శక్తివంతమైన ఉద్యమంగా రూపాంతరం చెందడం విశేషం. ఈ నిరసన కేవలం పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై ఆగ్రహాన్ని మాత్రమే ప్రతిబింబించలేదు. నిరుద్యోగం, నిలకడలేని వేతనాలు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, తగ్గుతున్న అవకాశాలు, ప్రజా సంస్థలపై క్షీణిస్తున్న విశ్వాసం వంటి అనేక సమస్యలతో యువతలో పేరుకుపోతున్న అసంతృప్తిని ఇది బహిర్గతం చేసింది. నిరసన స్థలం నుంచి వచ్చిన నివేదికలు ఒక స్పష్టమైన సామాజిక చిత్రాన్ని చూపించాయి. పదేపదే జరుగుతున్న పరీక్షల అవకతవకలతో నష్టపోయిన విద్యార్థులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ పట్టభద్రులు, అధిక పనిభారంతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, కోచింగ్ సెంటర్ల ఖర్చులతో భారమవుతున్న తల్లిదండ్రులు, భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న చిన్న పట్టణాల యువత అందరూ ఒకే వేదికపై కనిపించారు. వారి ఆందోళనలు కేవలం నీట్ వివాదం వరకే పరిమితం కాలేదు. జంతర్‌మంతర్ వద్ద కనిపించిన దృశ్యం, రాజకీయ రూపాన్ని సంతరించుకుంటున్న ఒక విస్తృత సామాజిక సంక్షోభానికి సంకేతంగా మారింది. ఈ నిరసన ప్రాముఖ్యత దాని పరిమాణంలో మాత్రమే లేదు. అది ప్రతిబింబించిన సామాజిక మనోభావంలో ఉంది. ఎన్నో సంవత్సరాలుగా భారత యువతకు విద్య, కష్టపడి పని చేయడం, పోటీ పరీక్షల్లో విజయం సాధించడం ద్వారా సామాజికంగా ఎదగవచ్చని చేసి చూపించారు. కానీ నేడు లక్షలాది మంది యువత ఖరీదైన కోచింగ్ కేంద్రాలు, పదేపదే వాయిదా పడుతున్న నియామక ప్రక్రియలు, పశ్నాపత్రాల లీకేజీలు, అనిశ్చిత ఉద్యోగాలు, తగ్గుతున్న వాస్తవ ఆదాయాల చక్రంలో చిక్కుకుపోయారు. నిరుద్యోగానికి సంకేతం ఉన్నత విద్యను పూర్తి చేసిన అనేక మంది పట్టభద్రులు కూడా తమ అర్హతలకు తగిన స్థిరమైన ఉద్యోగాలను సంపాదించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో యువతలో మౌనంగా పెరుగుతున్న అసంతృప్తిని ప్రధాన రాజకీయ పార్టీలు గుర్తించకముందే సిజెపి గుర్తించగలిగింది. అదే దాని విజయానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. యువత మనసులోని ఆవేదనకు, నిరాశకు, భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితికి సిజెపి ఒక వేదికగా మారగలిగింది. అందుకే ఒక వ్యంగ్య మీమ్‌గా మొదలైన ఈ వేదిక, కొద్ది కాలంలోనే దేశ యువత భావోద్వేగాలకు ప్రతినిధిగా నిలిచిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఉద్యమం అత్యంత వేగంగా విస్తరించడానికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో ప్రధానమైనది, భారత యువతలో అసంతృప్తి ఇప్పటికే పరాకాష్టకు చేరుకున్న సమయంలో ఈ ఉద్యమం ఆవిర్భవించడం. నీట్ పరీక్ష అవకతవకలు వంటి సంఘటనలు కేవలం తక్షణ ప్రేరకాలుగా మాత్రమే పనిచేశాయి. అసలు ఆగ్రహం మాత్రం ఎన్నో సంవత్సరాలుగా పేరుకుపోతోంది. ఆర్థిక అస్థిరత, ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రభుత్వ సంస్థలు న్యాయంగా పనిచేయడం లేదనే భావన యువతలో బలంగా పెరిగాయి. ఈ ఉద్యమం విజయానికి మరో ప్రధాన కారణం యువత అర్థం చేసుకునే భాషలో మాట్లాడగలగడం. సంప్రదాయ రాజకీయ ప్రసంగాలు తరచుగా యువతకు దూరంగా, ముందే సిద్ధం చేసిన మాటల్లా అనిపిస్తుంటాయి. అయితే సిజెపి వ్యంగ్యం, హాస్యం, మీమ్స్, స్వీయ వ్యంగ్య చిహ్నాలను ఉపయోగించి డిజిటల్ సంస్కృతిలో పెరిగిన యువతతో భావోద్వేగపరమైన అనుబంధాన్ని ఏర్పరచుకుంది. 'కాక్రోచ్' అనే రూపకాన్ని ఈ ఉద్యమం తన బలంగా మలుచుకుంది. వార్తా సేవ జిల్లా వార్తలు రాజకీయ విశ్లేషణ ఈ నేపథ్యంలోనే సిజెపి ఉద్యమం కేవలం పరీక్షల అవకతవకలపై కేంద్రీకృతమైన వేదికగా కాకుండా, విస్తృత ఆర్థిక అసంతృప్తికి ప్రతినిధిగా మారింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కనిపించిన జనసందోహం ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబించింది. ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల పక్కనే ఉద్యోగాల కోసం పోరాడుతున్న ఎంబిఎ పట్టభద్రులు, పెరుగుతున్న ధరలపై ఆందోళన చెందుతున్న ఉద్యోగులు, తమ పిల్లల భవిష్యత్తుపై భయపడుతున్న తల్లిదండ్రులు కనిపించారు. ఈ కోణంలో చూస్తే, జంతర్‌మంతర్ నిరసన గత దశాబ్దంలో ప్రపంచంలోని పలు దేశాల్లో వెలుగుచూసిన యువజన ఉద్యమాలను గుర్తు చేస్తుంది. ఇలాంటి ఉద్యమాలు కఠిన రాజకీయ సిద్ధాంతాల చుట్టూ కాకుండా, ఆర్థిక అసురక్షిత భావం, అనిశ్చిత జీవన పరిస్థితులు, అవకాశాల కొరత, వ్యవస్థలపై పెరుగుతున్న నిరాశ వంటి అంశాల చుట్టూ రూపుదిద్దుకున్నాయి. భారత యువతలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోందని ఈ నిరసన స్పష్టం చేసింది. అందువల్ల సిజెపి ఎదుగుదల ఒక రాజకీయ పరిణామం మాత్రమే కాకుండా, దేశ యువతలో పెరుగుతున్న ఆర్థిక అసంతృప్తి మరియు భవిష్యత్తుపై ఆందోళనకు ప్రతిబింబంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతి

### మలక్కా జలసంధికి అతిసమీపంలో జీఎన్ఐ ప్రాజెక్టు

న్యూఢిల్లీ,జూన్9 : గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతులు ఇచ్చింది. రూ.13వేల కోట్లతో పౌర-సైనిక విమానాశ్రయాన్ని నిర్మించనుంది. ఐఎన్ఎస్ బాజ్ వద్ద ఇప్పటికే ఉన్న నావికాదళ విమానాశ్రయాన్ని విస్తరించే ఆలోచనను పక్కనపెట్టింది. పర్యావరణపరంగా వైవిధ్యమైన ద్వీపంలో రూ.81వేల కోట్లతో ప్రకటించిన గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఇప్పటికే రాజకీయ దుమారం రేపుతోంది. ఈక్రమంలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం గమనార్హం. పౌర, సైనిక అవసరాలు తీరేలా గలాథియా బే సమీపంలోని చింగెన్ వద్ద ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. భౌగోళిక పరిమితుల వల్ల ఇప్పటికే ఉన్న ఐఎన్ఎస్ బాజ్ ఎయిర్‌స్టేషన్ వద్ద రన్‌వేను విస్తరించేందుకు దీర్ఘకాలికంగా ఉన్న ప్రణాళికను పక్కనపెట్టాల్సి వచ్చింది. రానున్న ఐదేళ్లలో దీని నిర్మాణం పూర్తికావొచ్చని సమాచారం. నికోబార్ దీవి మలక్కా జలసంధికి అతిసమీపంలో ఉండటంతో జీఎన్ఐ ప్రాజెక్టు వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుందని రక్షణరంగ వర్గాలు వివరించాయి. జలసంధికి సమీపంలోనే యుద్ధ నౌకలు, వైమానిక సదుపాయాలు ఉండటం నిఘాకు ఎంతో కీలకం కానుందన్నాయి. చైనాకు చెందిన 80 శాతం చమురు, 70 శాతం సహజవాయువు మలక్కా జలసంధి మీదుగా రవాణా అవుతుందని వెల్లడించాయి.రూ.81వేల కోట్ల గ్రేట్ నికోబార్ ఐలాండ్ (ఉఓఐ) డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కింద తలపెట్టిన మౌలిక సదుపాయాల్లో ఎయిర్‌పోర్ట్ ఒకటి. అండమాన్ నికోబార్ ఐలాండ్‌ను ఆర్థిక, వ్యూహాత్మక హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్రం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకుతీసుకువచ్చింది. ఈ ప్రాజెక్టును విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇది దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 160 చదరపు కిలోమీటర్ల మేర లక్షల చెట్లను నరికివేయాల్సి వస్తుందని, ఇది అభివృద్ధి అనే ముసుగులో జరుగుతున్న విధ్వంసమని మండిపడ్డారు.

## వీణా విజయన్‌కు ఇడి నోటీసులు

### 12న కొచ్చిలో విచారణకు హాజరు కావాలని ఆదేశం

తిరువనంతపురం,జూన్9 : సీఎమ్ఆర్ఎల్-ఎక్సాలాజిక్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ కేసుకు సంబంధించి 'ది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూతురు వీణా విజయన్‌కు సమన్లు జారీ చేసింది. జూన్ 12వ తేదీన శుక్రవారం కొచ్చిలోని ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. వీణా విజయన్‌తో పాటు 9మందికి ఈడీ సమన్లు జారీ చేసింది. పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు చెందిన ఐటీ కన్సల్టెన్సీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. ప్రైవేట్ మైనింగ్ కంపెనీ అయిన సీఎమ్ఆర్ఎల్‌తో ఓ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం కింద సీఎమ్ఆర్ఎల్ కంపెనీ.. వీణా విజయన్ కంపెనీకి 1.72 కోట్ల రూపాయల నుంచి 2.78 కోట్ల రూపాయల వరకు చెల్లించింది. అయితే, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి ఎలాంటి ఐటీ సేవలు అందించకుండానే ఈ మొత్తాన్ని చెల్లించినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యమంత్రితో ఉన్న కుటుంబ సంబంధాల వల్లే ఈ అక్రమ చెల్లింపులు జరిగాయని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. నేపథ్యంలోనే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వీణా విజయన్‌పై కంపెనీల చట్టం కింద కేసు నమోదు చేసింది. అంతేకాదు.. ఈ నిధుల మళ్లింపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీ లాండరింగ్ చట్టంకింద విచారణ చేపట్టింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మే 26వ తేదీన విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఇప్పుడు వీణా విజయన్‌కు నోటీసులు ఇచ్చారు.

## గచ్చిబౌలి చోరీ కేసులో పురోగతి

### నేపాలీ దంపతులు అరెస్ట్

### భారీగా బంగారు ఆభరణాలు స్వాధీనం


హైదరాబాద్ : గచ్చిబౌలి చోరీ కేసులో నేపాలీ దంపతులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్-నేపాల్ సరిహద్దు వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి భారీగా బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలిలోని హిల్ రిడ్జ్ విల్లాలో నివాసం ఉంటున్న పారిశ్రామికవేత్త ప్రకాశ్ ఇంట్లో నెల రోజుల క్రితమే నేపాలీ దంపతులు కమలా షాహీ, విమల్ షాహీ పనికి చేరారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలతో దంపతులు పరారయ్యారు. కొద్దిరోజుల క్రితం ముంబై వెళ్లిన పారిశ్రామికవేత్త కుటుంబం ఆదివారం తిరిగి వచ్చింది. ఇంట్లో నేపాలీ దంపతులు కనిపించకపోవడంతో వెళ్లిపోయారని మొదట భావించారు. అయితే, లాకర్‌లో ఉన్న బంగారం మొత్తం చోరీకి గురైనట్లు గుర్తించిన యజమాని.. గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను పట్టుకునేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఉత్తరాఖండ్, యూపీ, నేపాల్ సరిహద్దుల్లో నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఉత్తర్‌ప్రదేశ్ పోలీసుల సహకారంతో యూపీ-నేపాల్ సరిహద్దు వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

## స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు మంత్రి పరామర్శ

విశాఖపట్నం : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనలో గాయపడిన వారిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ పరామర్శించారు. మంగళవారం)ఉదయం షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను మంత్రి పరామర్శించి.. వారి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమైనదన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారిలో ముగ్గురు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## వర్తమానమే ఆదరణీయం

'ఓ అర్జునా! ప్రాణులన్నీ పుట్టుకకు ముందు అవ్యక్యాలు (ఇంద్రియ గోచరములు కానివి).. మరణానంతరం కూడా అవ్యక్తాలే. జనన మరణాల మధ్యకాలంలో మాత్రమే అవి ప్రకటితం అవుతున్నాయి. అలాంటి స్థితిలో వాటికోసం పరితపించడం నిష్ప్రయోజనం'.. అంటున్నాడు కృష్ణపరమాత్మ. వ్యక్తుల మధ్య బాంధవ్యాలు సహా ప్రతిదీ ఈ సృష్టిలో క్షణికమైనదే. ఎంత గొప్ప అనుబంధమైనా మరణంతో చెల్లిపోతుంది. కాబట్టి క్షణికమైన భౌతిక జీవనంపై ఉదాసీన భావనను కలిగి శాశ్వతమైన ఆత్మోన్నతికై పరిశ్రమించడం ఉత్తమమని పరమాత్మ చెబుతున్నాడు. భౌతిక జీవనానికి ప్రాధాన్యం ఇవ్వడం ప్రేయస్సుగానూ, ఆధ్యాత్మిక జీవితానికి ప్రాధాన్యం ఇవ్వడం శ్రేయస్సుగానూ చెబుతారు. ప్రేయస్సు బంధనాలకు కారణమవుతుంది. ఆత్మోద్ధరణ కోసం ఉద్యమిస్తే బంధనాలు విడిపోతాయి. శ్రేయస్సు సమకూరుతుంది. అలాగని ఏ ఒక్కటీ జీవితానికి సమగ్రతను చేకూర్చదు. రెండిటినీ సమన్వయం చేసుకోవడం ఉత్తమ జీవన విధానం. చైతన్యశీలత నిరంతర ప్రస్థానానికి ప్రతీక. చైతన్య శీలి అయిన వ్యక్తి ఊపిరులు ఉన్నంత వరకు ఏదైనా సాధించాలనే తపనతో జీవించాలి. ప్రతీ జీవి పుడుతుంది, మరణిస్తుంది. ప్రాకృతిక నియమం ప్రకారం ఆకృతి తీసుకున్న ప్రతిదీ ఆకారాన్ని కోల్పోవాల్సిందే! వ్యక్తి ప్రస్థానం 'అవ్యక్తం నుంచి అవ్యక్తం'లోకి చేరుకోవడమే. అవ్యక్తమైన అపరిమితత్వం నుంచి అపరిమితత్వానికి సాగే ప్రయాణంలో కర్మానుభవాన్ని పొందడం కోసం పరిమితులతో కూడిన వ్యక్తంగా అవతరించడం పుట్టుక. కాగా, భౌతిక జీవన పరిమితులను అధిగమించి అపరిమితత్వంలో లయం కావడం మరణం. గమ్యం గమనం నిర్ణయమయ్యాక జరిగేది పుట్టుక. గమ్యం చేరాక కలిగేది మరణం. మరణానికి పుట్టుకకు మధ్య వ్యాప్తి చెందిన జీవచైతన్యం తన లక్ష్యం కోసం పరితపిస్తుంది. మరణం గురించిన అవగాహనను పొందడమే మరణాన్ని జయించడం. ఏ కార్య సాధన అయినా మూడు ముఖ్యమైన మార్గాల గుండా ప్రయాణిస్తుంది.



ఆధ్యాత్మికం

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ
- నేర సమీక్షా సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ స్పష్టం చేశారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు అధికారుల మే నెల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, పోలీసు సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న కేసుల దర్యాప్తులో ఎలాంటి రాజీ పడకుండా పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారియోంను ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదయ్యే ప్రతి కేసును నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అవసరమైతే న్యాయ సలహా తీసుకుని దర్యాప్తును వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఆస్థి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాల కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆస్తుల గుర్తింపు, స్వాధీనం, అటాచ్‌మెంట్ ప్రక్రియలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మహిళలకు సంబంధించిన తీవ్రమైన కేసుల్లో నిందితుల అరెస్టులను ఆలస్యం చేయరాదని, గ్రేవ్ కేసులు, ఎన్‌డీపీఎస్ కేసులు తదితర కీలక కేసులను డీసీపీలు, ఏసీపీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని, చిన్నచిన్న నేరాలపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులు, సీసీసీ పిటిషన్ల విచారణలో క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిర్ధారించి పారదర్శకంగా వ్యవహరించాలని, దర్యాప్తు ప్రక్రియను పూర్తిగా నమోదు చేసిన అనంతరమే కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు ఎవరినీ అనవసరంగా పిలవరాదని, అరెస్టుల విషయంలో ఎసఓపీని కచ్చితంగా పాటించాలని సూచించిన కమిషనర్, పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని, విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వవద్దని హెచ్చరించారు. ప్రతి ఎస్‌హెచఓ, సీఐ స్థానిక ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసి ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. వాహనాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, తాళ్లు, కోన్స్, క్రైమ్ ప్రొటెక్షన్ రిబ్బన్, రైట్ గేర్ కిట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, వరదలలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించాలని, ప్రమాదంలో ఉన్న వారిని ఏ విధంగా రక్షించాలనే అంశాలపై తరచూ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహిస్తూ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించి నేరాల దర్యాప్తు, నేరస్తుల గుర్తింపు, కేసుల నిర్వహణలో పారదర్శకత, వేగాన్ని పెంపొందించేందుకు సీసీటీఎనఎస్ 2.0, ఈ సాక్ష్య వ్యవస్థలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సీసీటీఎనఎస్ 2.0 ద్వారా నేరాలు,





నేరస్థుల సమాచారాన్ని వేగవంతంగా నమోదు చేయడం, దర్యాప్తు ప్రక్రియను డిజిటలైజ్ చేయడం, ప్రజలకు అందించే సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సాక్ష్య వ్యవస్థ ద్వారా నేర సంఘటనలకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను సేకరించడం, భద్రపరచడం, కోర్టు విచారణల్లో సమర్పించే విధానాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు ఈ వ్యవస్థల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండి క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి డేటా ఫీల్డ్ రియల్ టైమ్‌లో నవీకరించబడుతూ ఉండాలని, వ్యవస్థల్లో నమోదయ్యే సమాచారం ఖచ్చితంగా, సమగ్రంగా ఉండాలని సూచించారు. సీసీటీఎనఎస్, ఎస్‌సీఆర్బీ నివేదికలు, ఎన్‌టీఆర్ ఫోటో డేటాబేస్‌తో పాటు ఇతర డిజిటల్ రికార్డులను నిరంతరం నవీకరించాలని, ఎస్‌హెచఓలు కేసులకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిర్ణీత సమయంలో సిస్టమ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎఫఐఆర్‌లు, నేర వివరాలు, సీడీ పార్ట్స్, 41 సీఆర్‌పీసీ ప్రక్రియలు, అరెస్టు వివరాలు, ఫారం 54, శాస్త్రీయ ఆధారాలు, చార్జ్‌షీట్లు వంటి అంశాలను నిర్దిష్ట సమయంలో అప్డేట్ చేయాలని తెలిపారు. అనవసరమైన లేదా తప్పుడు సమాచారాన్ని అప్లోడ్ చేయరాదని హెచ్చరించారు. సీసీటీఎనఎస్‌లో డేటా అప్లోడ్ పెండింగ్ లేకుండా పనిచేసే సిబ్బందికి రివార్డులు కూడా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎసఐలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల ఉజ్వల భవిష్యత్తు: కాల్వ శ్రీరాంపూర్ ఎంఈఓ సిరిమల్ల మహేష్

- ప్రైవేట్ మోజుతో డబ్బులు వృథా చేసుకోవద్దు
- ఆ సొమ్మును పిల్లల పేరిట ఫిక్స్డ్ డిపాజిట్ చేయండి
- ప్రభుత్వ బడుల నాణ్యతకు ఎస్ఎస్సీ ఫలితాలే నిదర్శనం
- ప్రధానోపాధ్యాయులకు నోట్ బుక్కుల పంపిణీ

**సుల్తానాబాద్, జూన్ 09 (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులే అత్యంత ప్రతిభావంతులని కాల్వ శ్రీరాంపూర్ మండల విద్యాధికారి (ఎం ఈ ఓ) సిరిమల్ల మహేష్ అన్నారు. మంగళవారం కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని హైస్కూల్ భవనంలో ఉషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యతో పాటు ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన రాత పుస్తకాలను (నోట్ బుక్కులను) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. అనుభవం, అంకితభావం, అత్యధిక విద్యార్హతలు కలిగిన ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల చేత ఇక్కడ విద్యాబోధన జరుగుతోందన్నారు. పాఠశాలల్లో సకల సౌకర్యాలను కల్పించడంతోపాటు, నిరంతరం పర్యవేక్షిస్తూ పిల్లల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల పట్ల మోజును విడనాడాలని ఆయన కోరారు. ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి సంపాదించిన వేలాది రూపాయలను ప్రైవేట్ ఫీజుల రూపంలో వృథా చేసుకోకుండా, ఆ సొమ్మును పిల్లల పేరు మీద ఫిక్స్ డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారని, అందుకు ప్రభుత్వ బడుల ఎస్ఎస్సి ( ఎస్ ఎస్ సి) ఫలితాలే నిదర్శనమని స్పష్టం చేశారు.



ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లలకే భవిష్యత్తులో అనేక విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు సిఆర్పిలు చందర్, ఉయ్యాల వీరయ్య, కుంట కుమారస్వామి, చంద్రకళ, రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## వంటగ్యాస్ ధరలను పెంచి ప్రజలపై బండ

- భారం మోపడం బీజేపీ ప్రభుత్వ అసమర్థతే - ప్రగతిశీల మహిళా సంఘం కార్యదర్శి శిరోమణి



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** కేంద్రంలో బీజేపీ మోడీ ప్రభుత్వం సామాన్యులపై ధరల భారాన్ని, మరోవైపు పన్నుల భారాన్ని మోపి జేబులు కొల్లగొడుతుందని ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్ శిరోమణి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక దపాలగా పెంచిన వంటగ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని మంగళవారం పిండిప్రోలు గ్రామంలో రాయల వెంకట్ నారాయణ భవనంలో గొడుగు ముత్తమ్మ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో శిరోమణి పాల్గొని మాట్లాడుతూ గృహ వినియోగ యల్.పీ.జీ సిలిండర్లపై రూ. 29, రూ,,లు పెంచడం పేదల జీవితాలపై ఆర్థిక దాడి చేయడమేనని అన్నారు. యుద్ధాల పేరుతో నిత్యావసర ధరలు పెంచుకుంటూ పోతే, పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితి కుదేలవుతుందని మండిపడ్డారు. సామ్రాజ్యవాద, పెట్టుబడి దేశాలు ప్రపంచ మార్కెట్ విస్తరణ కోసం, అయిల్ నిక్షేపాలు, కనిజ, సహజ వనరుల దోపిడి కోసం చిన్నదేశాలపై అత్యంత క్రూరంగా వైమానిక దాడులు చేస్తూ ప్రపంచ శాంతికి విఘాతం చేస్తుంటే భారత ప్రధాని యుద్ధాల నివారణపై నోరువిప్పక పోవడం అసమర్ధతకు నిదర్శనం అన్నారు. సామ్రాజ్య వాద దేశాల మధ్య యుద్దాల ప్రభావం ఆర్థిక వ్యవస్థను విద్వాంసం చేస్తుందని, పకృతి సహజ వనరులను కోల్పోతామని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పన్నెండేళ్లలో ఇప్పటికే అనేకసార్లు గ్యాస్, ఆయిల్ ధరలు పెంచిందని మండిపడ్డారు. మళ్ళీ వినియోగదారులపై అధికంగా గ్యాస్ ధరలు పెంచుతున్నారని అన్నారు. దేశ ప్రజలపై అధిక భారాలను మోపాలనే మోడీ ప్రభుత్వ ఆలోచనను వెనక్కి తీసుకొని పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని అన్నారు. హిందువుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచి దేశంలో ఉన్నా 80%మంది హిందువులను లూటి చేస్తుందని అన్నారు. ఉజ్వల గ్యాస్ లను యధావిధి గానే సంవత్సరానికి 9 కనెక్షన్ ఇవ్వాలని కోత విధించడానికి ప్రారంభించుకోవాలని, దేశభక్తి అంటే ప్రజల ఆస్తులను లూటి చేయడం కాదని, ప్రజల ఆర్థిక అభివృద్ధిని సాధించడం అని శిరోమణి ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఓ. డబ్ల్యూ పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినపల్లి సరోజన, బందెల లలిత, కుంబజడ భారతమ్మ, సొంటి సుగుణ, గౌని పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా..ఎదుర్కోలేక.. ఫోన్ ట్యాపింగ్ చేశారు

- బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం.. మా ఫోన్లను ట్యాప్ చేశారు.
- ఫోన్ ట్యాపింగ్ విచారణకు హాజరైన.. మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తింపు
- పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన మాజీ మేయర్
- ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**బోడుప్పల్ :(ది క్రైమ్ న్యూస్):** గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించడంతో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మంగళవారం విచారణకు హాజరయ్యారు. 2023 అక్టోబర్‌లో తన ఫోన్ నంబర్‌ను ట్యాప్ చేసినట్లు అధికారులు చూపించినట్లు తెలిపారు.గత ఎన్నికల్లో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,తండ్రి తోటకూర వజ్రెష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాల కోసం తన ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. విచారణ అనంతరం అజయ్ యాదవ్ మాట్లాడుతూ,గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిఘా వ్యవస్థలను దుర్వినియోగం చేసి అక్రమ మార్గాల్లో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నించిందని విమర్శించారు.తన తండ్రి విజయం దిశగా సాగుతుండటాన్ని తట్టుకోలేక అప్పటి మంత్రి మల్లారెడ్డి కుట్రపూరితంగా ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పోరాటం ప్రజల మద్దతుతో జరగాలని, నిఘా వ్యవస్థలు,అక్రమ ఫోన్ ట్యాపింగ్‌లతో కాదని పేర్కొంటూ,ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై సిట్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నగర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు: మేయర్ కొలగాని శ్రీనివాస్


- దుర్షేడ్ ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు
- మల్లన్న ఆలయం నుండి ఎల్లమ్మ ఆలయం వరకు నూతన స్ట్రీట్ లైట్ల ప్రారంభం





**కరీంనగర్ టౌన్, జూన్ 09(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 4వ డివిజన్ దుర్షేడ్ శివారులో గల ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.అనంతరం మల్లన్న దేవాలయం నుండి ఎల్లమ్మ దేవాలయం వరకు ఏర్పాటు చేసిన నూతన స్ట్రీట్ లైట్లను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ యొక్క ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. డివిజన్ల వారీగా సమస్యలను గుర్తిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ భూపతి రవీందర్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## విద్యా సంస్థల దోపిడీ అరికట్టాలి



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, ప్రహరీ గోడలు, డిజిటల్ విద్యా సదుపాయాలు వంటి ప్రాథమిక మౌలిక వసతులు అనేక చోట్ల సరిపడా లేవు. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను తక్షణమే కల్పించవలసిందిగా కోరుతున్నాము. అదేవిధంగా, జిల్లాలోని కొన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయి. ఫీజుల వివరాలను పారదర్శకంగా వెల్లడించకుండా ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అలాగే, కొన్ని పాఠశాలలు విద్యార్థులు తప్పనిసరిగా తమ వద్ద నుంచే లేదా నిర్దిష్ట దుకాణాల నుంచే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ అక్రమంగా పాఠ్యపుస్తకాల విక్రయాలు నిర్వహిస్తున్నాయి. ఈ చర్యలు తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయి. ఇంకా, ప్రభుత్వ అనుమతులు లేకుండా లేదా విద్యాశాఖ నిబంధనలను పాటించకుండా నిర్వహించబడుతున్న పాఠశాలలను గుర్తించి, వాటిపై సమగ్ర విచారణ జరిపి అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయవలసిందిగా కోరుతున్నాము.లేని యెడల రానున్న రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## ఇంద్రేశం మున్సిపాలిటీలో అక్రమ ఇటుక బట్టీల దందా?

- చెరువుల మట్టితో కోట్ల వ్యాపారం..
- అధికారుల మౌనం ఎందుకు?
- పన్నులు ఎగ్గొట్టి ఇటుక బట్టీల నిర్వహణ..
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఐనోల్-చిన్న కంజర్లలో విచ్చలవిడిగా ఇటుక బట్టీలు



**పటాన్చెరు, జూన్ 09(ది క్రైమ్ న్యూస్):** పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని ఐనోల్, చిన్న కంజర్ల, ఇంద్రేశం గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులు, కుంటల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి ఇటుకల తయారీకి వినియోగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ చెరువుల నుంచి మట్టిని తరలించడం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లడమే కాకుండా, ప్రభుత్వ ఆస్తులు దెబ్బతింటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాల ద్వారా కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటుక బట్టీల నిర్వహణలో పలు చోట్ల ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, రుసుములు ఎగ్గొడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమంగా నడుస్తున్న ఇటుక బట్టీలపై రెవెన్యూ, మైనింగ్, కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెరువుల మట్టి అక్రమ తరలింపును అరికట్టి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఇటుక బట్టీలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అర్హులైన ప్రతి పేదవానికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు
- రూ. 66 లక్షల విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
- రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి
- కేంద్రం మొండిచేయి చూపించినా ధాన్యం కొనుగోలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే



**సుల్తానాబాద్, జూన్ 09(ది క్రైమ్ న్యూస్):** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల పూర్తి చిత్తశుద్ధితో ఉందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 66 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. 66,07,656 విలువైన చెక్కులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన ప్రభుత్వ విప్‌కు స్థానిక తహసీల్దార్ రాముడు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు ఇవ్వకుండా తీవ్రంగా మోసం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, పేదల సొంతింటి కల నెరవేరుస్తోందని అన్నారు. ఇందులో భాగంగా మొదటి విడత కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ప్రభుత్వం కేటాయించిందని, జూన్ చివరి నాటికి రెండో విడత కింద అదనంగా మరో 2,000 ఇళ్లను ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. గ్రామాల్లో జనాభాను బట్టి, ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా పూర్తిగా అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మృగశిర కార్తె ప్రారంభమైనందున రైతులు ఆలస్యం చేయకుండా నార్లు పోసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆలస్యమైతే దిగుబడి తగ్గే అవకాశం ఉన్నందున, తక్కువ రోజుల్లో (105 రోజుల్లో) చేతికొచ్చే వరి రకాలను ఎంచుకోవాలని కోరారు. వరికి ప్రత్యామ్నాయంగా పత్తి, మొక్కజొన్న, కందులు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వీటికి పూర్తి స్థాయిలో మద్దతు ధర కల్పిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపించినప్పటికీ, రాష్ట్ర ఖజానాపై భారమైనా సరే రైతులకు న్యాయం చేయాలనే ఏకైక ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని విజయరమణ రావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పనులను చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపు కుంటున్నారని, అలాంటి వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ రాముడు, ఎంపీడీవో దివ్య దర్శన్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రన్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్యలతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు , స్థానిక ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# బిఆరెస్ మాజీ మంత్రుల ఆరోపణలకు కాంగ్రెస్ నాయకుల రివర్స్ కౌంటర్



**ధర్మపురి, జూన్ 9, (ది క్రైమ్ న్యూస్):** బిఆరెస్ మాజీ మంత్రుల ఆరోపణలకు కాంగ్రెస్ పార్టీ నాయకుల రివర్స్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం ధర్మపురి పట్టణంలోని స్థానిక బ్రాహ్మణ సంఘ భవనంలో ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పార్టీ విధేయతకు కట్టుబడి ఉండే నాయకుడని పేర్కొన్నారు. 2006లో జడ్పీటీసీగా అవకాశం కల్పించిన నాయకత్వానికి ఇప్పటికీ కృతజ్ఞతతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. క్యాబినెట్ హోదా లేకపోయినా మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఫోటోను తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్న నాయకుడు లక్ష్మణ్ కుమార్ అని, అలాంటి నాయకుడిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ధర్మపురి అభివృద్ధి పనుల కోసం నిల్వ చేసిన ఇసుకపై ఇసుక మాఫియా ఆరోపణలు చేయడం మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌కు తగదన్నారు. టీఆర్ఎస్ హయాంలోనే ఇసుక వ్యాపారం జరిగిందని, ప్రస్తుతం కేవలం చిన్న వ్యాపారులు మాత్రమే ఇసుక వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. ధర్మపురిలో క్వారీకి సరిపడా ఇసుక లేకపోవడంతో అనుమతులు ఆలస్యమవుతున్నాయని, ఈ విషయం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కూడా తెలుసని తెలిపారు. అదేవిధంగా, ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై పోరాడాల్సిన నాయకులు కేవలం ఆరోపణలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్చుకోలేక అనవసర విమర్శలు చేస్తున్నారని వారు ఆరోపించారు. వరి కొనుగోళ్ల అంశంపై కూడా స్పందించిన నాయకులు, రైతుల అనుమతితోనే ధాన్యం తూకాలు జరుగుతున్నాయని, కొనుగోలు కేంద్రాల్లో పెద్దగా సమస్యలు లేవని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలపై సమాధానం చెప్పాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, ధర్మపురి అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వాటిని అడ్డుకునే ఉద్దేశంతోనే ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. చివరగా, అవినీతి ఆరోపణలపై అవసరమైతే ప్రమాణాలకు కూడా సిద్ధమని వారు బిఆరెస్ నాయకులకు సవాల్ విసిరారు.

# గీతంలో తల్లి పేరిట ఒక మొక్క: పర్యావరణ పరిరక్షణకు గీతం కట్టుబాటు



**పటాన్చెరు, జూన్ 09(ది క్రైమ్ న్యూస్):** గీతం యూనివర్సిటీలో మంగళవారం దేశవ్యాప్త 'తల్లి పేరిట ఒక మొక్క' (ఏక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. పర్యావరణ సుస్థిరత, జీవావరణ స్పృహను పెంపొందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన ఈ చొరవలో భాగంగా తమ తల్లుల గౌరవార్థం ఒక మొక్కను నాటాలని పౌరులను ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్‌తో పాటు వివిధ స్కూళ్ల అధిపతులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్యాంపస్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉన్నతాధికారులు వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో, జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో, సుస్థిర జీవన విధానాన్ని ప్రోత్సహించడంలో మొక్కల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. తల్లుల పట్ల గౌరవాన్ని చాటుతూ ప్రకృతి సంరక్షణకు అంకితభావాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. పచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం గీతం చేపడుతున్న సుస్థిరత, సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో ఇది మరో ముఖ్యమైన అడుగుగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ నిర్మాణంలో అర్థవంతమైన భాగస్వామ్యం కల్పించేలా ఈ కార్యక్రమం సిబ్బంది, విద్యార్థులను ప్రేరేపిస్తోంది.




# చిట్టిప్రోలు కేశవులు, లక్కం ప్రసాద్ పార్థివ దేహాలకు నివాళులర్పించిన

## జిల్లా బి ఆర్ ఎస్ నాయకులు తోటరామరావు



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ సారధి నగర్, జూబ్లీ పుర స్థిర నివాసితులు చిట్టిప్రోలు కేశవులు విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి లక్కం ప్రసాద్, ఆటో డ్రైవర్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అధికంగా ఉన్న ఎండ తాపానికి గురై మృతి చెందారు. సమాచారం అందుకున్న జిల్లా బి ఆర్ ఎస్ నాయకులు తోట రామారావు వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదారుస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలియపరిచి మృతుల పార్థివ దేహం పై పుష్పగుచ్చం ఉంచి నివాళు లర్పించారు. తదనంతరం రోజువారి ఆటో సంపాదనతో జీవనం సాగిస్తున్న పేద కుటుంబం ఆటో డ్రైవర్ లక్కం ప్రసాద్ కుటుంబానికి మానవీయ దృక్పథంతో దహన సంస్కరణ నిమిత్తం 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వంగాల వెంకట్, చేతి కృష్ణ, బాబా, కిషన్ నాయక్, చింటూ, వేల్పుల శ్రీను, ఆర్ టి సి శ్రీను, శ్రీనాథ్, సాయిరాం, నరసయ్య, రాము, వేణు, నవీన్, శేఖర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.


# నేడు కలెక్టరేట్ ముట్టడి

## సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రో సహా నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ను ముట్టడిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. మంగళవారం సిపిఐ జిల్లా సమితి పక్షాన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. సంపన్నులు కార్పొరేట్ వర్గాలను రక్షిస్తూ సామాన్యులపై భారాలు మోపుతుందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఇప్పుడు ఆ హామీలను అమలు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. రుణమాఫీ అంటూ హామీ ఇచ్చి పూర్తి స్థాయిలో అమలు చేయలేదని రైతు భరోసాకు ఎగనామం పెడుతున్నారని సురేష్ తెలిపారు. మహిళలకు నెలకు రూ.2,500, కళ్యాణ లక్ష్మి క్రింద తులం బంగారం తక్షణం అమల్లోకి తీసుకు రావాలని, వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వమే కొనగోలు చేసి త్వరితగతిన రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ముట్టడి జరుగుతుందన్నారు. ఈ ముట్టడి కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తదితరులు పాల్గొంటారని సురేష్ తెలిపారు.

# మాజీ మంత్రి హరీష్ రావుని కలిసిన సిద్ధినేనిగూడెం మాజీ సర్పంచ్ నాగిరెడ్డి



**మధిర ప్రతినిధి, జూన్ 9(ది క్రైమ్ న్యూస్):** మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుని హైదరాబాదులో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన సిద్ధినేనిగూడెం గ్రామం మాజీ సర్పంచ్ వేమిరెడ్డి పెద్దనాగి రెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి మహాసభకు వెళ్లే బస్సుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి



**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇందిరా మహిళా శక్తి మహాసభ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బయలుదేరిన మహిళల బస్సుకు హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారత రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, సాధికారత కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మహాసభకు వెళ్లే మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మహిళా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అమృత్ స్కీం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీలో అమృత్ స్కీం కింద నిర్మాణంలో ఉన్న నీటి నిల్వ ట్యాంకుల పనులను నల్గొండ జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. పర్యవేక్షణ అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించిన కలెక్టర్, అమృత్ స్కీం పరిధిలో నిర్మాణంలో ఉన్న నాలుగు ట్యాంకుల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించి, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ చైర్మన్ , మున్సిపల్ కమిషనర్ , వైస్ చైర్మన్ తో పాటు పలువురు వార్డు కౌన్సిలర్లు, వారి సలహాదారులు, కో–ఆప్షన్ సభ్యులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అమృత్ స్కీం పనులు త్వరగా పూర్తైతే హాలియా పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

# గుడిసె వాసి కుటుంబం అగమ్య గోశరం



**భూపాలపల్లి/కాటారం/మహా ముత్తారం/జూన్ - 9:(ది క్రైమ్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం వజినేపల్లి గ్రామానికి చెందిన మొగిలి రాజబాబు ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు కట్టుకునే స్తోమత లేక పూరి గుడిసెలో నేను నా భార్య పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాము సోమవారం రాత్రి గాలి దుమారంతో కూడిన భారీ వర్షానికి గుడిసెకు కప్పిన పరదా గాలికి లేచిపోవడంతో ఉరుములు మెరుపులతో బిక్కు బిక్కుమంటూ ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని గడిపామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభిమాని,కార్యకర్త, అయినప్పటికీ నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరి కాలేదన్నారు. డబ్బులు ఇచ్చిన వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే అతనికి చేయి లేదు, హాండ్ క్యాప్డ్, ముగ్గురు ఆడపిల్లలు, సొంత పార్టీ వాళ్ళే నన్ను మోసం చేశారని అన్నారు.పూరిగుడిసెలో పరదాలు కప్పుకొని జీవనం కొనసాగిస్తున్నాననీ తన గోడును వినిపించారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

● (టియుడబ్ల్యూజె-ఐజేయు) జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్

**భూపాలపల్లి/ కాళేశ్వరం/ జూన్ -9:(ది క్రైమ్ న్యూస్):** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన, సంఘం బలోపేతమే ధ్యేయంగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాళేశ్వరంలో జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్‌కార్డు సభ్యుడు సామల శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకణాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. జర్నలిస్టుల సంక్షేమం, హెల్త్‌కార్డుల జారీ, ఇళ్ల స్థలాల కేటాయింపు, జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ అమలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని, రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ప్రతి జర్నలిస్టుకు అందేలా సంఘం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల సాధనలో టీయూడబ్ల్యూజే చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రతి పాత్రికేయుడు సంఘంతో అనుబంధం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సంఘ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకమని పేర్కొంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ సభ్యత్వాలు నమోదు చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ నెల 29న భూపాలపల్లిలో నిర్వహించనున్న జిల్లా మాససభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు సట్ల మురళి, ఎంఎల్ఎన్ మూర్తి, శ్రీశైలం, ప్రవీణ్‌కుమార్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, మూబిన్, టేమ్జ్ అధ్యక్షుడు సాంబయ్య, రజనీకాంత్, సుమన్, రాజబాబు, లక్ష్మీనారాయణ, కామిడి బాస్కర్ రెడ్డి, సుదాకర్ తో పాటు జిల్లాలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమ సాధన దిశగా ఈ సమావేశం ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.







# ఇటుకబట్టీల్లో బంధీలవుతున్న బ్రతుకులు

● కాలుతున్నవి ఇటుకలు కాదు ● వేలాది నిరుపేద బతుకులు ● ఒడిశా కార్మికుల శ్రమతో కోట్ల లాభాలు - కనిపించని మానవ హక్కులు ● పెరుగుతున్న హింస, వేధింపులు ● తట్టుకోలేక పారిపోతున్న కార్మికులు ● సి పి యు ఎస్ ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్ ఆవేదన ● పెద్దపల్లి జిల్లాలో ఇటుక బట్టీల్లో శ్రమ దోపిడీ, నిర్బంధ పనులు, దారుణ జీవన పరిస్థితులపై ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ (సీపీయూఎస్ఐ) ఆందోళన వ్యక్తం చేసింది

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** జిల్లాలోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వేలాది మంది వలస కార్మికుల జీవితాలు నేటికీ బానిసత్వాన్ని తలపిస్తున్నాయని ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. రమేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న ఇటుక బట్టి యజమానులు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ, వారికి కనీస మానవ హక్కులు కూడా కల్పించడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది వలస కార్మికులు పెద్దపల్లి జిల్లా పరిధిలోని రాఘవాపూర్, రంగాపూర్, రాంపల్లి, సుల్తానాబాద్, చింతకుంట, మొగుదుంపూర్ , బహుపేట, రేకుర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీలకు ఒడిశా రాష్ట్రం నుంచి వేలాది మంది నిరుపేద, చదువురాని కార్మికులను తీసుకువచ్చి పనుల్లో నిమగ్నం చేస్తున్నారని తెలిపారు. అయితే "సమాన పనికి సమాన వేతనం" అనే ప్రాథమిక సూత్రాన్ని తుంగలో తొక్కుతూ వారికి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. లాభాలు యజమానులకు.. కష్టాలు కార్మికులకు అన్నట్టు తయారయింది. ఇటుక బట్టి వ్యాపారం ద్వారా యజమానులు లక్షల రూపాయల లాభాలు గడిస్తున్నప్పటికీ, కార్మికుల కుటుంబాలకు తాగునీరు, వైద్యం, విద్య వంటి కనీస సౌకర్యాలు కూడా అందించడం లేదని ఆరోపించారు. చిన్నారులు విద్యకు దూరమవుతుండగా, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు వైద్య సహాయం కూడా అందడం లేదని పేర్కొన్నారు. గర్భిణిని కూడా వదలని అమానుషత్వం... గతంలో ఒక నిండు గర్భిణి మహిళను బట్టి యజమానులు సూపర్వైజర్లు దారుణంగా హింసించి ప్రాణాలు తీసిన ఘటన జిల్లాలో సంచలనం సృష్టించిందని గుర్తుచేశారు. ఆరోగ్యం సహకరించకపోయినా కార్మికులను బెదిరించి, కొట్టి, బలవంతంగా పనులు చేయించుకోవడం ఇప్పటికీ కొనసాగుతోందని తెలిపారు. హింసలను తట్టుకోలేక కార్మికులు పారిపోతున్నారు. ఫిర్యాదులు చేసినా న్యాయం కరువు. అనేక సందర్భాల్లో హింస, వేధింపులను తట్టుకోలేక కార్మికులు ఇటుక బట్టీల నుంచి పారిపోతున్నారని చెప్పారు. గతంలో వందలాది మంది కార్మికులు బట్టీలను బహిష్కరించి సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రాంతాలకు కాలినడకన వచ్చి జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులకు తమ గోడును వినిపించినప్పటికీ, సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలే తప్ప శాశ్వత న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వినబడుతున్నాయి. ఇన్ని ఘటనలు చోటు చేసుకున్నప్పటికీ కూడా ఇప్పటివరకు ఏ ఒక్క ఇటుక బట్టి యజమానిపై కూడా కఠిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని సి. రమేష్ అన్నారు. జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని కోరారు. అధికారులు స్వయంగా ఇటుక బట్టీల వద్దకు వెళ్లి కార్మికుల జీవన పరిస్థితులను పరిశీలించాలని, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వలస కార్మికుల హక్కులను కాపాడేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని కోరారు. రాజ్యాంగం ఉన్నా రక్షణ లేదా? భారత రాజ్యాంగం కార్మికులపై నిర్బంధం, హింస, మానభంగాలు, హత్యలు, వ్యక్తిగత స్వేచ్ఛల హరణ వంటి చర్యలపై కఠిన చట్టపరమైన నిబంధనలు కలిగి ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర వైఫల్యం కనిపిస్తోందని విమర్శించారు. దీంతో ఇటుక బట్టి యజమానుల ఆగడాలకు అడ్డుకట్ట లేకుండా పోతోందన్నారు. అమాయకత్వమే పెట్టుబడిగా దోపిడీకి తెగబడ్డారన్నారు. ఒడిశా నుంచి వచ్చిన అమాయక కార్మికుల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ, తగిన ఆహారం కూడా అందించకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్మికుల కష్టార్జిత శ్రమతో యజమానులు విలాసవంతమైన జీవితాలు గడుపుతుండగా, కార్మిక కుటుంబాలు మాత్రం దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఇటుక బట్టీలపై సమగ్ర విచారణ జరిపి, కార్మికులపై జరుగుతున్న శ్రమ దోపిడీ, నిర్బంధ పనులు, హింసాత్మక చర్యలపై బాధ్యులైన యజమానులు, సూపర్వైజర్లపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. "కార్మికుడి చెమటతో నిలిచే ఇటుకకు విలువ ఉంది... మరి ఆ కార్మికుడి ప్రాణానికి విలువ లేదా?" "బట్టీల్లో ఇటుకలు మాత్రమే కాదు... వేలాది జీవితాలు కూడా కాలిపోతున్నాయని రమేష్ తన ఆవేదనను వ్యక్తం చేశాడు.



# విశాఖ ఉక్కులో విషాదం.. కార్మికుల ప్రాణాలకు ఎవరు బాధ్యులు?

● 9 మంది కార్మికుల సజీవ దహనం ● ఇద్దరు తెలంగాణ బిడ్డలు ● కార్మికుల పక్షాన కట్కూరి సందీప్

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో చోటుచేసుకున్న ఘోర ప్రమాదం యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మెటల్ లిక్విడ్ లాడిల్ పేలిపోవడంతో మరుగుతున్న ద్రవ ఉక్కు కార్మికులపై పడటంతో తొమ్మిది మంది కార్మికులు సజీవ దహనమవడం అత్యంత విషాదకర ఘటన. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, మృతుల్లో ఇద్దరు తెలంగాణకు చెందినవారు ఉండటం మరింత బాధాకరం. ఈ విషాద ఘటనతో ఎన్నో కుటుంబాలు ఒక్కసారిగా అనాథలయ్యాయి. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాల కన్నీరుకు ఓదార్పు చెప్పడం కూడా కష్టంగా మారింది. ఈ దుర్ఘటనపై పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కట్కూరి సందీప్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి బాధలో తాము భాగస్వాములమని ప్రకటించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే నాయకుడిగా గుర్తింపు పొందిన కట్కూరి సందీప్, ఈ ఘటనను కేవలం ప్రమాదంగా కాకుండా వ్యవస్థ వైఫల్యంగా అభివర్ణించారు. కార్మికుల ప్రాణ భద్రత విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. "ఇంకెన్ని ప్రాణాలు బూడిద కావాలి? ఇంకెన్ని కుటుంబాలు రోడ్డున పడాలి?" అంటూ కట్కూరి సందీప్ లేవనెత్తిన ప్రశ్నలు ప్రస్తుతం ప్రతి కార్మికుడి గుండె చప్పుడు లాగా వినిపిస్తున్నాయి. గత పదకొండు సంవత్సరాలుగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఉద్యమాలు చేస్తున్నప్పటికీ పాలకులు స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునీకరణకు బదులుగా ప్రైవేటీకరణ ఆలోచనలతో ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తుప్పు పట్టిన యంత్రాలే ప్రమాదాలకు కారణమా? ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ అవసరం ఈ ఘటన వెనుక కేవలం సాంకేతిక లోపమా? లేక దీర్ఘకాలిక నిర్లక్ష్యమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాతబడ్డ యంత్రాలను మార్చకుండా, భద్రతా ప్రమాణాలను పక్కన పెట్టడం వల్లే ఇలాంటి ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయని కట్కూరి సందీప్ అభిప్రాయపడ్డారు. తగిన నిర్వహణ, ఆధునిక యంత్రాలు, కఠిన భద్రతా చర్యలు అమలు చేసి ఉంటే అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదని పేర్కొన్నారు. ప్రమాదంపై ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. విశాఖ ఉక్కు కర్మాగార పరిస్థితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని కట్కూరి సందీప్ ఆరోపించారు. కార్మికుల ప్రాణ భద్రతను విస్మరించి కేవలం ఆర్థిక లెక్కలకే పరిమితమైన పాలన ఫలితమే ఈ విషాదమని విమర్శించారు. "పేరుకే ఉక్కు సంకల్పం... తెరవెనుక ఆపరేషన్ సైలెంట్ కిల్లింగ్" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం కార్మిక వర్గంలో చర్చనీయాంశంగా మారాయి. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలి. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం కల్పించాలి. మృతుల కుటుంబాలకు భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కట్కూరి సందీప్ డిమాండ్ చేశారు. అలాగే గాయపడిన కార్మికులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి మరణాల సంఖ్య పెరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కును కాపాడాలి... కార్మికుల ప్రాణాలను రక్షించాలి విశాఖ ఉక్కు కేవలం ఒక పరిశ్రమ కాదు. వేలాది కుటుంబాల జీవనాధారం. లక్షలాది ప్రజల భావోద్వేగం. అలాంటి సంస్థను నిర్లక్ష్యం చేయడం అంటే కార్మికుల జీవితాలతో ఆటలాడటమే. ఈ విషాద ఘటన మరొకసారి కార్మిక భద్రత, పరిశ్రమల ఆధునీకరణ, ప్రభుత్వ బాధ్యతలపై పెద్ద ప్రశ్నార్థకాన్ని నిలబెట్టింది. ఇకనైనా పాలకులు మేల్కొని విశాఖ ఉక్కును బలోపేతం చేయాలని, కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థిద్దాం.



# అనధికార చెత్త సేకరణ దారులకు వృత్తి భద్రతా శిక్షణ



**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** పురపాలక సంఘం హాలియా ఆధ్వర్యంలో హాలియా మున్సిపాలిటీలో అనధికార చెత్త సేకరణదారులుగా నమోదు చేసుకున్న 36 మందికి కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారిత మంత్రిత్వ శాఖ, కేంద్ర గృహ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖల సమన్వయంతో జాతీయ పారిశుద్ధ్య కార్మికుల ఆర్థికాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వృత్తి భద్రతా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని తమ వృత్తిలో ఆధునిక పద్ధతులను అవలంబించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా అనధికార చెత్త సేకరణదారులకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు అందజేయడంతో పాటు, అనధికార చెత్త సేకరణదారులుగా గుర్తింపు ధ్రువపత్రాలు జారీ చేయనున్నట్లు చెప్పారు. ఈ ధ్రువపత్రాల ద్వారా వారికి వ్యక్తిగత రుణాలు, వారి పిల్లల విద్యాభివృద్ధి కోసం విద్యా రుణాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే వారందరికీ భద్రతా పరికరాల కిట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్, 10వ వార్డు కౌన్సిలర్ సలహాదారు పిల్లి ఆంజనేయులు, మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, జాతీయ పారిశుద్ధ్య కార్మికుల ఆర్థికాభివృద్ధి సంస్థ శిక్షణాధికారి గాంధీ పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 4, 5, 9వ వార్డుల వార్డు సభలు నేడు

**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 కార్యాచరణ కార్యక్రమం -- 5వ దశలో భాగంగా 4, 5, 9వ వార్డులకు సంబంధించిన వార్డు సభలు జూన్ 10, 2026న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. వార్డు సభల నిర్వహణ ప్రదేశాలు, సమయాలు: 9వ వార్డు సభ -- శాంతినగర్‌లో ఉదయం 9:00 గంటలకు 4, 5వ వార్డుల సభలు -- న్యూ కిడ్స్ స్కూల్‌లో ఉదయం 10:30 గంటలకు సంబంధిత వార్డుల ప్రజలందరూ వార్డు సభలకు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సభ అనంతరం వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికుల చేయూత పెన్షన్ దరఖాస్తులతో పాటు ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను కూడా స్వీకరించనున్నట్లు తెలిపారు. వార్డు సభలో చర్చించనున్న ముఖ్య అంశాలు ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు: వర్షపు నీటి సంరక్షణ, మురుగు కాలువల శుభ్రత, వర్షాకాల సన్నద్ధత, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు మరియు వీధి దీపాలు మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ పంటల మార్పిడి పై సూచనలు రోడ్డు భద్రత నియమాలు ఈ అంశాలపై చర్చించేందుకు వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నందున 4, 5, 9వ వార్డుల ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని వార్డు సభలను విజయవంతం చేయాలని హాలియా మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రైవేటు పాఠశాలల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి: ఏఐఎస్ఎఫ్




**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మిర్యాలగూడ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్ మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్న పాఠశాల యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2026--27 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో మిర్యాలగూడ మండల పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను పాఠశాలల్లోనే విక్రయిస్తూ వ్యాపార ధోరణిని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో కష్టపడి సంపాదించిన డబ్బును అధిక ఫీజుల రూపంలో చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రతి ప్రైవేటు పాఠశాల తమ ఫీజు వివరాలను పాఠశాల బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించేలా ప్రభుత్వం సర్క్యులర్ లేదా జీవో జారీ చేయాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంగోత్ అనిల్, సీలి వినయ్, పేరుపాక సంతోష్, ఎండీ రఫీ, సీహెచ్ కిరణ్, ఎండీ అబ్దుల్, ఏఐవైఎఫ్ నాయకులు బసక పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్‌పేట సాయిబాబా ఆలయం, ఎల్ఐసీ కార్యాలయం వద్ద యూ-టర్న్ సదుపాయం కల్పించాలి: బీజేపీ వినతి



**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌పేట సాయిబాబా ఆలయం, ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించే విధంగా యూ-టర్న్ సదుపాయం ఏర్పాటు చేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో రోజువారీగా భారీగా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయని, యూ-టర్న్ సదుపాయం లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని యూ-టర్న్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, బీజేపీ రాష్ట్ర ధార్మిక సెల్ కో-కన్వీనర్ చిలుకూరి శ్యామ్, పులి రామచంద్రు, మేకల రవి, అంకసాని శ్రీను, పులి శ్రీనివాస్, మేకల నందు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

● హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల పనితీరుపై సీపీ ప్రశంసలు





**హుజురాబాద్, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** వార్షిక తనిఖీల్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటి, కార్యాలయ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. డీజీపీ ఆదేశాల మేరకు సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య వ్యవస్థల్లో కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను జూన్ 15లోగా నమోదు చేయాలని సూచించారు. పాత పెండింగ్ కేసులతో పాటు కొత్తగా నమోదయ్యే కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, కేసుల దర్యాప్తులో ఈ-సాక్ష్య యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. గత నెలలో కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షోరూంలో జరిగిన దోపిడీ ఘటన నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసినట్లు సీపీ తెలిపారు. నగల దుకాణాలు, బ్యాంకులు, లాడ్జీలు, హోటళ్లలో భద్రతా ప్రమాణాలను సమీక్షించి సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణపై ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రతా లోపాలు గుర్తించిన యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. నేరాల నియంత్రణలో భాగంగా నేపాల్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల వివరాలను పోలీస్ స్టేషన్లలో నమోదు చేస్తున్నామని తెలిపారు.

అనుమానాస్పద ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, హోటళ్లు, లాడ్జీల్లో కార్డన్ అండ్ సెర్చ్, వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతున్నాయని చెప్పారు. పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం నార్కోటిక్స్ విభాగంలో శిక్షణ పొందిన పోలీస్ డాగ్ స్క్వాడ్ సహాయంతో పాన్ షాపులు, హాస్టళ్లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, డ్రగ్స్ వినియోగం లేదా అక్రమ రవాణాలో పాల్గొన్న వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం 'షీ లీడ్స్', 'స్నేహిత' కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని సీపీ తెలిపారు. పనిచేయని సీసీ కెమెరాలను గుర్తించి మరమ్మతులు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. తనిఖీల అనంతరం హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల పనితీరు, రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సీపీ గౌష్ ఆలం, అధికారులను అభినందించారు. సమీక్షలో చర్చించిన అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, రామకృష్ణ గౌడ్, వెంకట్, శ్రీనివాస్, ఎస్సైలు స్వాతి, ఆవుల తిరుపతి తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

● గర్భిణీలు సేవలను వినియోగించుకోవాలి



**జయశంకర్ భూపాలపల్లి జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల పరిధిలో ప్రతినెల తొమ్మిదో తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం రేగొండ పీహెచ్సీలో నిర్వహించడం జరిగిందని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 10 సంవత్సరాల నుంచి నిర్వహించడం జరుగుతుందని, గర్భిణి స్త్రీలకు నాణ్యమైన సమగ్ర గర్భధారణ వైద్య సేవలను అందించడం తల్లి శిశు మరణాలను తగ్గించడం హైరిస్క్ గర్భధారణను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందించబడే సేవలు గర్భిణీలకు సమగ్ర వైద్య పరీక్షలు రక్తపోటు బరువు రక్తహీనత పరీక్షలు రక్తం మూత్ర పరీక్షలు మరియు ఇతర అవసరమైన వ్యాపరీక్షలు గర్భస్థ శిశు పెరుగుదల అంచనా అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ సేవలు హైరిస్ గర్భిణీలను గుర్తింపు ప్రత్యేక పర్యవేక్షణ ఐరన్ పోలిక్ యాసిడ్ కాల్షియం మాత్రల పంపిణీ ప్రసవానికి ముందు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య అవగాహన పోషకాహారం తల్లిపాల ప్రాముఖ్యత కుటుంబం మద్దతుపై కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగినది గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా తమ మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డు వెంట తీసుకురావాలి కనీసం నాలుగు ఏఎంసీ చెకప్ లు చేయించుకోవాలి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు గర్భిణీ స్త్రీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సురక్షిత మాతృత్వం ఆరోగ్యకరమైన శిశు లక్ష సాధనలో భాగస్వాములు కావాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి తెలియజేశారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 237మంది గర్భిణీ స్త్రీలను పరీక్షలు జరిపి 46 మంది హైరిస్క్ గర్భిణీ స్త్రీలను సేవలు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హిమబిందు సూపర్వైజర్లు ఆశాలు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా జిల్లా రవాణా శాఖ అధికారిని కలిసిన యూనియన్ ట్రావెల్స్ ప్రతినిధులు



**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాకు నూతనంగా నియమితులైన జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సందాని, వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను పాత బస్టాండ్ ప్రైవేట్ ట్రావెల్స్ యూనియన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ పరిధిలోని రవాణా వ్యవస్థ, ప్రైవేట్ ట్రావెల్స్‌కు సంబంధించిన పలు అంశాలపై వారు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాత బస్టాండ్ ప్రైవేట్ ట్రావెల్స్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ భాయ్, రఘుపతి రెడ్డి, చారి, నవీన్, కిషన్ పాల్గొన్నారు. అలాగే ప్రైవేట్ ఆర్టీసీ బస్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ చుక్క వేణుగోపాల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అధికారులు తమకు సహకరించాలని ప్రతినిధులు కోరగా, నిబంధనల మేరకు పూర్తి సహకారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు..

## ఏరియా ఆసుపత్రి ఇంచార్జ్ సూపర్డెంట్‌గా డాక్టర్ పారుపెల్లి శ్రీకాంత్ రెడ్డి..



**హుజురాబాద్ జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ నల్ల నారాయణరెడ్డి నీ బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా నారాయణరెడ్డిని పరిగి ఆసుపత్రికి బదిలీ చేయగా హుజురాబాద్ లో ఆయన స్థానంలో ఎవరికి కేటాయించలేదు. దాంతో ప్రస్తుతం అదే ఆసుపత్రిలో పనిచేస్తున్న సీనియర్ సర్జన్ డాక్టర్ పారుపేల్లి శ్రీకాంత్ రెడ్డినీ ఇన్చార్జి సూపరిండెంట్ గా నియమించారు.

## ప్లాట్ రిజిస్ట్రేషన్‌లో సర్వే నంబర్ పొరపాటు..

**- నలుగురిపై కేసు నమోదు**

**జమ్మికుంట జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** పెద్దంపల్లి కు చెందిన ఉపాధ్యాయుడు దొడ్డే దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ప్లాట్ విక్రయించిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డే దుర్గాప్రసాద్ (46), ప్రస్తుతం జమ్మికుంటలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారంలో ఉన్న అంజనా టౌన్‌షిప్‌లో 59వ నంబర్ ప్లాట్‌ను జొన్నతుల కోనారెడ్డి, రాఘవరెడ్డి, గర్రెపల్లి అరుణ్‌కుమార్, టి. రాజేశ్వరరావు తదితరుల నుండి కొనుగోలు చేశారు. అయితే, ప్లాట్‌కు సంబంధించిన మదర్ డాక్యుమెంట్ నెం. 3778/2024లో లేఅవుట్‌కు సంబంధించిన సర్వే నంబర్లు 94, 95, 100 ఉండాల్సి ఉండగా, లేఅవుట్‌కు సంబంధం లేని సర్వే నంబర్ 103ను కూడా జతచేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. లేఅవుట్ ప్రొసీడింగ్స్‌ను పరిశీలించగా సర్వే నంబర్ 103 లేకపోయినా, డాక్యుమెంట్ నెం. 2830/2025లో ఆ సర్వే నంబర్ నమోదు కావడంతో బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసిన ఫిర్యాదుదారుడి లోన్‌ను అధికారులు తిరస్కరించినట్లు తెలిపారు. ఈ విషయమై ప్లాట్ విక్రయించిన వారిని సంప్రదించగా, సవరణ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయకుండా కాలయాపన చేస్తూ తనను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదుదారుడు ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మిర్యాలగూడలో ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి డిజబుల్డ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు క్లియో స్పోర్ట్స్ మైదానంలో గత కొన్ని రోజులుగా ఉత్సాహభరితంగా కొనసాగిన రాష్ట్ర స్థాయి డిజబుల్డ్ (వికలాంగుల) క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ముగిసింది. టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శారీరక పరిమితులు ఉన్నప్పటికీ క్రీడల పట్ల ఉన్న అంకితభావంతో అద్భుత ప్రతిభ కనబరిచిన ప్రతి క్రీడాకారుడు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. వికలాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందించడంలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేశారు. రన్నరప్ జట్టుతో పాటు టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గ్రహీతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు బహూకరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికప్రజాప్రతినిధులు,క్రీడానిర్వాహకులు,వివిధసంఘాలనాయకులు, క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు పాల్గొనడంతో టోర్నమెంట్ విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

# మిర్యాలగూడలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన









**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణ పరిధిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల పనులను శాసనసభ్యులు (బీఎల్ఆర్), మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధ--బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష--నవీన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, 38వ వార్డు కౌన్సిలర్ భవాని--ఇంద్రకుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి తదితరులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, పనులను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. అలాగే కాలనీల్లో రోడ్లు, తాగునీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన నివాస వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ పట్టణంలో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ









**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ" కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 25వ వార్డులో అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధ--బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష--నవీన్, 25వ వార్డు కౌన్సిలర్ ఆడావత్ మనోజ్ కుమార్ పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళల సంక్షేమం మరియు సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని తెలిపారు. అలాగే 99 రోజుల కార్యాచరణ ద్వారా పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మహిళలు, ప్రజాప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేతపై ప్రజలకు విజ్ఞప్తి

**నల్గొండ ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ముఖ్య గమనిక. నేడు 10-06-2026 (బుధవారం) ఉదయం 8:00 గంటల నుండి 10:00 గంటల వరకు 33/11 కేవీ టౌన్ సబ్‌స్టేషన్ నుండి వచ్చే అశోక్ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్‌పై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకోనున్నారు. దీని కారణంగా అశోక్ నగర్, వాసవి నగర్, సంతోష్ నగర్ మరియు హనుమాన్‌పేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయబడుతుంది. అని ఏ ఈ,ఎన్. రవీంద్రరెడ్డి ఏఈ, మిర్యాలగూడ టౌన్ విద్యుత్ శాఖ, మిర్యాలగూడ. తెలిపినారు. కాబట్టి పై ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

## వ్యవసాయ అధికారి సంతోష్ కుమార్‌ను సత్కరించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి



**మధిర ప్రతినిధి, జూన్ 9 (ది క్రైమ్ న్యూస్):** వ్యవసాయ మార్కెట్ కమిటీ మధిర ను సందర్శించిన నూతనంగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఖమ్మం జిల్లా మార్కెటింగ్ అధికారి ఆర్. సంతోష్ కుమార్ ని వ్యవసాయ మార్కెట్ కమిటీ మధిర చైర్మన్ బండారు నరసింహారావు వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సౌకర్యాలు, మార్కెట్ కార్యకలాపాలు భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి మార్కెట్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

# చరిత్ర సృష్టించిన భారత్

**భారత్ చేతిలో చిత్తుచిత్తుగా ఓడిన అఫ్ఘనిస్థాన్..**
**ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో భారీ విజయం!**
**భారత స్పిన్‌కు అఫ్ఘాన్ ఆటగాళ్లు కాకావికాలం**
**తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్**
**రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ప్యాకప్**
**ఏడు వికెట్లతో సత్తాచాటిన మానవ్ సుతార్**
**నిప్పులు చెరిగిన కుల్దీప్, వాషింగ్టన్ సుందర్**




ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఏకైక టెస్టులో అఫ్ఘనిస్థాన్ జట్టు చిత్తు చిత్తుగా ఓడింది. తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్ అయిన అఫ్ఘన్.. రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ముగించింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 564/8 పరుగులు చేయడంతో.. ఈ టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టెస్టుతో డెబ్యూ చేసిన మానవ్ సుతార్ ఓవరాల్‌గా ఏడు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. భారత్ – అఫ్ఘనిస్థాన్ మధ్య జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. మూడు రోజుల్లో ముగిసిన ఈ టెస్టులో టీమిండియా ఆధిపత్య ధోరణి ప్రదర్శించింది. ఆరంభం నుంచి ఏకపక్షంగా సాగిన ఈ టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. డబ్ల్యూటీసీ ఛాంపియన్ షిప్ 2025 –27లో టీమిండియాకు ఈ విజయం చాలా సపోర్ట్ ఇవ్వనుంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ టెస్టులో మూడో రోజు అఫ్ఘనిస్థాన్ రెండుసార్లు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో 113/5తో మూడో రోజు ఆట మొదలుపెట్టిన అఫ్ఘనిస్థాన్.. మొదటి సెషన్‌లోనే 152 పరుగులకే ఆలౌట్ అయింది. ఫాలో ఆన్ ప్రారంభించిన అఫ్ఘనిస్థాన్ లంచ్ బ్రేక్‌కి ముందు ఎలాంటి వికెట్లు కోల్పోలేదు. లంచ్ బ్రేక్ తర్వాత టీమిండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ తొలి వికెట్ తీసుకోగా.. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్ అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లను పెవిలియన్‌కు క్యూ కట్టించాడు. ఓపెనర్ సెడికుల్లా అటల్ క్రీజులో ఉన్నంత సేపు కొంచెం పోరాడిన అఫ్ఘనిస్థాన్ ఆ తర్వాత నుంచి కుప్పకూలింది. దాంతో మూడో రోజు ఆట మిగిలుండగానే అఫ్ఘనిస్థాన్ కేవలం 112 పరుగులకే ఆలౌట్ అయింది. అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లలో సెడికుల్లా అటల్ 42, రహ్మనుల్లా గుర్బాజ్ 24, రహ్మత్ షా 13 పరుగులు చేయగా.. మిగతా అందరూ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ బాట పట్టారు. భారత బౌలర్లలో సుందర్ 4, కుల్దీప్ 3, మానవ్ సుతార్ 1, సిరాజ్ 1 వికెట్ పడగొట్టారు. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 127 ఓవర్లు ఆడి 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి డిక్లేర్ ఇచ్చింది. కేఎల్ రాహుల్ 100, శుభ్‌మన్ గిల్ 126, సాయి సుదర్శన్ 81, రిషభ్ పంత్ 81, వాషింగ్టన్ సుందర్ 52 పరుగులు చేశాడు. ఈ టెస్టుతో ఎంట్రీ ఇచ్చిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు, రెండో ఇన్నింగ్స్ ఒకటి ఓవరాల్‌గా ఏడు వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు. 412 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అఫ్ఘానిస్థాన్ 35.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ సెదిఖుల్లా అటల్(80 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 42), రెహ్మనుల్లా గుర్బాజ్(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. వాషింగ్టన్ సుందర్(3/30), కుల్దీప్ యాదవ్(4/36) అఫ్ఘాన్ పతనాన్ని శాసించారు. మానవ్ సుతార్‌కు ఒక వికెట్ దక్కింది.



## బౌలర్లు అలసిపోక పోవడంతోనే ఫాలో ఆన్ ఆడించాం

**టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్**

తమ బౌలర్లు అలసిపోకపోవడంతోనే అఫ్ఘానిస్థాన్‌ను ఫాలో ఆన్ ఆడించామని టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ప్రస్తుతం భారత టెస్ట్ టీమ్ సంధి దశలో ఉందని, పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ విభాగంలో మార్పులు ఉంటాయని చెప్పాడు. ముల్లాన్‌పూర్ వేదికగా సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో అఫ్గాన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన గిల్.. ఇది సంపూర్ణ విజయమని తెలిపాడు. 'ఇది ఒక సంపూర్ణమైన విజయం. మూడు విభాగాల్లో రాణించాం. అందుకే ఈ విజయం చాలా సంతోషాన్నిచ్చింది. వాతావరణం చాలా వేడిగా ఉంది. లంచ్‌కు ముందు లేదా మొదటి డ్రింక్స్ విరామం తర్వాతే వారిని ఆలౌట్ చేస్తే.. మా బౌలర్లు అలసిపోకుండా ఉన్నారో లేదో చూసి ఫాలో–ఆన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఒకవేళ అలా కాకపోతే.. మేం ఒక రెండు సెషన్ల పాటు బ్యాటింగ్ చేసి.. చివర్లో అఫ్గాన్‌కు బ్యాటింగ్ అప్పగించాలని అనుకున్నాం. కానీ మాకు వేగంగా వికెట్లు దక్కాయి. దాంతో మ్యాచ్‌పై పట్టు సాధించాం. అలాగే మా ఫాస్ట్ బౌలర్లు బౌలింగ్ చేసిన తీరు కూడా అద్భుతం. మేం ఫాలో–ఆన్ ఇచ్చినప్పుడు సిరాజ్ కీలకమైన వికెట్ అందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ప్రసిద్ధ్ మూడు ముఖ్యమైన వికెట్లు తీశాడు.మానవ్ సుతార్, వాషింగ్టన్, కుల్దీప్‌ల నైపుణ్యం, నాణ్యతపై మాకు ఎలాంటి సందేహం లేదు. కానీ ఎక్కువ ఓవర్లు వేయించి వారికి తగి అనుభవం దక్కేలా చూశాం. ఇలాంటి పిచ్‌లపై బ్యాటర్లను ఎలా బోల్తా కొట్టించాలి, పేస్‌ను ఎలా మారుస్తూ ఉండాలి, వేర్వేరు ఏరియాల్లో బ్యాటర్లను ఎలా పరీక్షించాలి అనే విషయాలను తెలుసుకోవడం ముఖ్యం.ఇది యువ జట్టు. ట్రాన్సిషన్ దశలో ఉంది. కాబట్టి జట్టులో మార్పులు ఉంటాయి. అయితే పరిస్థితులు, వేదికలతో సంబంధం లేకుండా ముందుగా బ్యాటింగ్ చేసినప్పుడు బోర్డుపై 350 పరుగులు ఉంచడానికి ప్రయత్నించాలి. ఎక్కడైనా సరే 20 వికెట్లు తీయగలరనే నమ్మకం మా బౌలింగ్ గ్రూప్‌పై ఉంది. జట్టులో మార్పులు జరుగుతున్నప్పుడు.. బ్యాటింగ్ గ్రూప్‌పై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. మేం అనుభవాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తున్నాం. ఒక బ్యాటింగ్ గ్రూప్‌గా వేర్వేరు పరిస్థితుల్లో.. వేర్వేరు సందర్భాలలో ఏ విధమైన ఆట తీరు జట్టుకు ఉపయోగపడుతుందో తెలుసుకోవడానికి, బలమైన జట్టును నిర్మించడానికి మేం ప్రయత్నిస్తున్నాము. అలాగే స్కోర్‌బోర్డ్‌పై క్రమం తప్పకుండా 350–400 పరుగులు ఎలా ఉంచాలో చూస్తున్నాం.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.

# ఫ్రెంచ్ టైటిల్‌ను ముద్దాడిన జ్వెరెవ్

**పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో విజయం**
**ఫ్లావియో కోబోలీని మట్టికరిపించిన జ్వెరెవ్**

జర్మనీకి టెన్నిస్ స్టార్ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ ఎట్టకేలకు తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్?ను ముద్దాడాడు. ఆదివారం ఫ్రాన్స్?లో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్?లో జ్వెరెవ్ విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన ఈ ఫైనల్?లో జ్వెరెవ్? ఇటలీకి చెందిన ఫ్లావియో కోబోలీని 6–1, 4–6, 6–4, 6–7, 6–1 తేడాతో ఓడించి ఛాంపియన్‌గా నిలిచాడు. దీంతో జ్వెరెవ్ ఎమోషనల్? అయ్యాడు. విజయం అందుకున్న వెంటనే అతడు నేలపై పడుకొని కన్నీళ్లు కార్చాడు. ఒక్క టైటిల్?కే అంతలా ఎమోషనల్ అవ్వాల్సిన పని ఏముంది అని అనుకోవచ్చు! కానీ జ్వెరెవ్?కు ఇది సాధారణం విజయం కాదు. కెరీర్?లో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఈ విజయం సాధించాడు.మనమంతా గ్రౌండ్?లో చూస్తున్న జ్వెరెవ్ వేరు. అతడు ఒక అద్భుత ఆటగాడని అంతరికీ తెలుసు. కానీ, అతడు గత 25ఏళ్లుగా సుదీర్ఘ కాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్నాడని అనేక మందికి తెలియని విషయం. 4ఏళ్ల చిన్నతనంలోనే టైప్– 1 డయాబెటిస్ బారిన పడిన జ్వెరెవ్, 25 ఏళ్లుగా అనేక కఠిన సవాళ్లు ఎదుర్కొన్నాడు. ఎంతోమంది నిరుత్సాహపరిచినా కుంగుబాటుకు గురవ్వకుండా తల్లిదండ్రుల సాయంతో ముందడుగు వేశాడు. వ్యాధితో బాధపడుతున్నా వెనక్కి తగ్గకుండా పోరాడాడు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కెరీర్?లో రాణించాడు.టెన్నిస్?లో కొనసాగాలంటే శారీరక శ్రమ చాలా అవసరం. అందుకే మానసికంగానే కాదు శారీరకంగానూ దృఢంగా ఉండాలి. లేదంటే మ్యాచ్ మధ్యలోనే వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలా ఆటలో రాణిస్తూనే, ఆరోగ్యాన్ని సైతం కాపాడుకోవాలంటే చాలామంది వెనక్కి తక్కుతారు. కానీ జ్వెరెవ్ అలా చేయలేదు. కఠోర శ్రమ, ఎంతో ధైర్యంతో మధుమేహం వ్యాధిని ఎదుర్కొన్నాడు. ఈ ప్రయాణంలో అతడికి తల్లిదండ్రుల ప్రోత్సాహం లభించింది. వాళ్ల మద్దతుతో వెనక్కి తిరిగి చూడకుండా కెరీర్?లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. టైప్ 1 మధుమేహంతో బాధపడుతున్న పిల్లల్లో అవగాహన కల్పించేందుకు జ్వెరెవ్ హెల్త్‌కేర్ టెక్నాలజీకి చెందిన మెడ్‌ట్రోనిక్‌తో జత కట్టాడు. ఈ సమస్యతో బాధపడుతూ నిరాశలో కుంగిపోయిన వాళ్లలో ధైర్యం కల్పించేందుకు ముందుకు వచ్చాడు. 'టెన్నిస్ ప్లేయర్ కావాలనేది నా కల. అయితే ఇలాంటి ఆరోగ్య సమస్య ఉంటే అది సాధించడం అసాధ్యమని అనేక మంది నన్ను నిరుత్సాహపరిచారు. కానీ, నేను నా కుటుంబం దీనిని ఏ మాత్రం అంగీకరించలేదు. అందుకే ఇలాంటి సమస్యతో బాధపడుతున్న చిన్నారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెడ్‌ట్రోనిక్‌తో జత కట్టాను. మధుమేహం సమస్యతో బాధపడుతున్నవాళ్లు వారు కోరుకుంటున్న జీవితాన్ని పొందాలని కోరుకుంటున్నా' అని గతంలో జ్వెరెవ్ ఓ సందర్భంలో చెప్పాడు.




# గెలుపే నా టార్గెట్..

**నా కెప్టెన్సీ నాదే.. ఎవరి మాట నేను వినను**
**టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**

ఇండియా టీ20 టీమ్ కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ అఫీషియల్ గా అనౌన్స్ అయ్యాడు. సెలెక్షన్ కమిటీ మీటింగ్ లో 31 ఏళ్ల అయ్యర్ ను ఈ పొజిషన్ కు ఎంపిక చేశారు. మార్చి నెలలో ఇండియాకు టీ20 వరల్డ్ కప్ అందించి సక్సెస్ ఫుల్ గా నిలిచిన సూర్యకుమార్ యాదవ్ ప్లేస్ లో అయ్యర్ బాధ్యతలు తీసుకోబోతున్నాడు. ఈ కొత్త రెస్పాన్సిబిలిటీ పై శ్రేయాస్ అయ్యర్ స్పందిస్తూ, కెప్టెన్ అయ్యాను కదా అని తన పర్సనాలిటీ ని మార్చుకోవాల్సిన అవసరం లేదని చెప్పాడు. ఎవరి నీడలోనో ఉండటానికి తాను ఇష్టపడనని, ముంబై లో కఠినమైన క్రికెట్ ఎన్విరాన్ మెంట్ లో పెరిగిన పాత శ్రేయాస్ లాగే ఉంటానని స్పష్టం చేశాడు. ముంబై లో పెరగడం వల్ల చిన్నప్పటి నుంచి ఛాలెంజ్ లను ఫేస్ చేయడం అలవాట అయిందని అయ్యర్ ఒక ఈవెంట్ లో గుర్తు చేసుకున్నాడు. అక్కడ క్రికెట్ క్రేజ్ చాలా ఎక్కువని, స్ట్రీట్ లో ఆడే ప్రతి చిన్న పిల్లాడు ముంబై టీమ్ కు ఆడాలని కలలు కంటాడని చెప్పాడు. అటువంటి హై కాంపిటీషన్ నుంచి రావడం వల్లే తన మైండ్ సెట్ ఎప్పుడూ గెలవడం పైనే ఉంటుందని తెలిపాడు. ప్రతి మ్యాచ్ లో గెలవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం తన అలవాటని, ఈ కంపిటీటివ్ నేచరే తనను ఈ స్టేజ్ కి తీసుకొచ్చిందని అన్నాడు. ఇప్పుడు వచ్చిన కెప్టెన్సీ ఒక గ్రేట్ ఛాలెంజ్ అని, దీన్ని లీడ్ చేయడానికి తాను రెడీగా ఉన్నానని హింట్ ఇచ్చాడు. శ్రేయాస్ అయ్యర్ కు కెప్టెన్సీ ఇవ్వడం పై బీసీసీఐ మాజీ ప్రెసిడెంట్, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పాజిటివ్ గా రెస్పాండ్ అయ్యాడు. అయ్యర్ బాగా పర్ఫార్మ్ చేశాడని, ఈ కెప్టెన్సీ రోల్ కు అతడు వంద పర్సెంట్ అర్హుడని ప్రశంసించాడు. అలాగే సూర్యకుమార్ యాదవ్ ను కెప్టెన్సీ నుంచి తీసేయడం అన్యాయం ఏమీ కాదని, సెలెక్టర్లు టీమ్ ఫ్యూచర్ ను దృష్టిలో ఉంచుకొని ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నారని గంగూలీ వ్యాఖ్యానించాడు. కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ కు ఐర్లాండ్ టూర్ ఫస్ట్ అసైన్ మెంట్ కాబోతోంది. అక్కడ ఇండియా టూ టీ20 మ్యాచ్ లు ఆడనుంది. అయ్యర్ డిసెంబర్ 2023 లో తన లాస్ట్ టీ20 మ్యాచ్ ఆడాడు, ఆ తర్వాత ఫామ్ కోల్పోయి టీమ్ లో ప్లేస్ పోగొట్టుకున్నాడు. ఇప్పుడు మళ్లీ మిడిల్ ఆర్డర్ లో సూర్యకుమార్ యాదవ్ కు లైక్–టు–లైక్ రీప్లేస్ మెంట్ గా టీమ్ లోకి వచ్చి డైరెక్ట్ గా కెప్టెన్ సీటును దక్కించుకోవడం విశేషం. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత టీ20 జట్టు విజేతగా నిలిచింది. భారత్ గెలిచినా.. సూర్య దారుణంగా విఫలమయ్యాడు. మరోవైపు శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్‌తో తన సారథ్య ప్రతిభతో ఆకట్టుకున్నాడు. ఐపీఎల్ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టడమే కాకుండా ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు తీసుకెళ్లాడు.తాజా సీజన్‌లోనూ జట్టును మెరుగ్గా నడిపించాడు. కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ సత్తా చాటాడు. దాంతో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శ్రేయస్ వైపు మొగ్గు చూపింది. శ్రేయస్ రాకతో సూర్య కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోవాల్సి వచ్చింది.

# టెస్టుల్లో అతిపెద్ద విజయం..!

టెస్ట్ క్రికెట్‌లో భారత క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో 94 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే కని వినీ ఎరుగని విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ మ్యాచు ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. దీంతో భారత గడ్డపై టెస్టుల్లో అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 564/8 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ ఇచ్చింది. అనంతరం తమకు అలవాటైన రీతిలో స్పిన్‌తో ప్రత్యర్థికి ఉచ్చు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో అఫ్ఘానిస్థాన్‌ను 152 పరుగులకు కుప్పకూల్చింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ మరింత చెలరేగిపోయిన భారత బౌలర్లు.. అఫ్ఘానిస్థాన్‌ను 112 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో విక్టరీ నమోదు చేసింది. సొంత గడ్డపై అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. తాజా ఫలితంతో టెస్ట్‌ల్లో అతిపెద్ద విజయం సాధించిన రెండో ఆసియా టీమ్‌గా టీమిండియా నిలిచింది. ఈ జాబితాలో భారత్ కంటే పాకిస్థాన్ ముందు వరుసలో ఉంది. 2002లో లాహోర్‌లో న్యూజిలాండ్‌పై పాకిస్థాన్ ఇన్నింగ్స్ ఁ 324 పరుగుల తేడాతో విక్టరీ నమోదు చేసింది.ఈ మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్ డెబ్యూ చేసిన మానవ్ సుతార్ ప్లేయర్ ఆఫ్ ది అవార్డు గెలుచుకున్నాడు. ఈ మ్యాచులో బ్యాటింగ్‌లో 28 రన్స్ చేసిన అతడు.. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ తీశాడు. దీంతో టీమిండియా తరఫున ఆడిన తొలి మ్యాచులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.

# ముందింది ఫిఫా వరల్డ్ కప్ సంగ్రామం

**జూన్ 11 నుంచి జులై 19 వరకు టోర్నీ**
**48 జట్లు, 104 మ్యాచ్‌లతో ఫిఫా వరల్డ్ కప్**
**అమెరికా, మెక్సికో, కెనడా దేశాల్లో ఫిఫా సందడి**
**39 రోజులు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ పండుగ**





ఫుట్‌బాల్ ప్రేమికుల కలల వేదిక, ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన క్రీడా సంబరం ఫీఫా ప్రపంచకప్ మరోసారి సరికొత్త రికార్డులతో మన ముందుకురాబోతోంది. 2026లో జరగబోయే ఈ టోర్నమెంట్ కేవలం ఒక ఆట మాత్రమే కాదు, ఫుట్‌బాల్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం. ఇప్పటి వరకు మనం చూసిన ప్రపంచ కప్‌ల కంటే ఇది భిన్నంగా, భారీగా ఉండబోతోంది. ప్రపంచకప్ ఎందుకు ప్రత్యకమైందో తెలుసుకోవాలంటే ముందుగా దాని పరిమాణాన్ని చూడాలి. గతంలో 32 జట్లు మాత్రమే టోర్నీలో పాల్గొనేవి. కానీ ఈసారి ఏకంగా 48 జట్లు ట్రోఫీ కోసం పోటీ పడబోతున్నాయి. జట్ల సంఖ్య పెరగడంతో మ్యాచ్‌ల సంఖ్య కూడా 104కు చేరుకుంది. ఇది ఫుట్‌బాల్ ప్రపంచంలో అతి పెద్ద, సుదీర్ఘమైన టోర్నమెంట్‌గా నిలవనుంది. సుమారు 39 రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులను ఈ టోర్నీ ఉర్రూతలూగించనుంది. ఈ మెగా టోర్నీకి ఉత్తర అమెరికా ఖండంలోని మూడు దేశాలు కెనడా, మెక్సికో, యునైటెడ్ స్టేట్స్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జూన్ 11న మెక్సికో సిటీలోని ప్రతిష్టాత్మకమైన మెక్సికో సిటీ స్టేడియంలో ఘనంగా ప్రారంభంకానుంది. ఆతిథ్య దేశం మెక్సికో తన సొంత గడ్డపై స్థానిక అభిమానుల కేరింత మధ్య తొలి మ్యాచ్ ఆడనుంది. జులై 19న న్యూయార్క్–న్యూజెర్సీ స్టేడియంలో ప్రపంచ విజేత ఎవరో తేలిపోనుంది. ఫుట్‌బాల్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఫిఫా జట్ల సంఖ్యను పెంచింది. దీని వల్ల మరిన్ని దేశాలకు ప్రపంచ క్ వేదికపై తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుంది. ఈ క్రమంలోనే కేప్ వెర్డే, కురాకో, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ వంటి దేశాలు తొలిసారిగా ప్రపంచకప్ బరిలోకి దిగుతున్నాయి. ఇది ఆయా దేశాల్లో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి గొప్ప ఊతాన్ని ఇస్తుంది. మొత్తం 48 జట్లను 12 గ్రూపులుగా విభజించారు. ఇవి ఏ నుంచి ఎల్ వరకు ఉన్నాయి. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. ప్రతి జట్టు తన గ్రూపులోని మిగిలిన మూడు జట్లతో తలపడుతుంది. గతంలో ఉన్న 8 గ్రూపుల స్థానంలో ఇప్పుడు 12 గ్రూపులను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. ప్రతి గ్రూప్ నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా నాకౌట్ దశకు చేరుకుంటాయి. వీరితోపాటు, 12 గ్రూపుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 8 మూడవ స్థాన జట్లు కూడా నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. దీని వల్ల మొదటిసారిగా ప్రపంచకప్‌లో రౌండ్ ఆఫ్ 32 అనే కొత్త దశను ప్రవేశ పెట్టారు. అంటే టైటిల్ గెలవాలంటే ఒక జట్టు గతంలో లాగా 7 మ్యాచ్‌లు కాకుండా, ఈసారి 8 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది.

# విశ్వజ

## మహిళా ఎన్ఆర్ఐ 'చెత్త' బిజినెస్.. రూ.1000 కోట్లు టార్గెట్



ఉన్నత చదువులు చదువుకుంది. కానీ ఆశించిన ఉద్యోగమేదీ రాలేదు. రిస్క్ చేయాల్సిందే అని నిర్ణయించుకుంది. ఆ నిర్ణయమే ఆమెను రూ. 800 కోట్ల కంపెనీకి అధిపతిగా మార్చింది. గట్టి కృషి, పట్టుదలతో వ్యాపార వేత్తగా రాణిస్తోంది. ఎంతోమంది మహిళా పారిశ్రామిక వేత్తలకు, పర్యావరణవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఎన్ఆర్ఐ వ్యాపారవేత్త, పూనమ్ గుప్తా స్ఫూర్తిదాయక గాథను తెలుసుకుందాం రండి..! ఎన్ఆర్ఐ వ్యాపారవేత్త పూనమ్ గుప్తా ఢిల్లీలో 1976, ఆగష్టు 17న ఢిల్లీలో పుట్టింది. లేడీ ఇర్విన్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం. ఆ తర్వాత, ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి గ్రాడ్యుయేషన్, ఢిల్లీ %ఖీూ=జు% స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, హాలెండ్‌లోని మాస్ట్రిక్ట్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్నేషనల్ బిజినెస్ అండ్ మార్కెటింగ్‌లో ఎంబీఏ పట్టాలు పుచ్చుకుంది. 2002లో వివాహం కావడంతో భర్త పునీత్ గుప్తాతో కలిసి స్కాట్లాండ్‌కు వెళ్లారు. స్కాట్లాండ్‌లో ఆమెకు ఉద్యోగం దొరక లేదు. అర్హతలున్నప్పటికీ, పదేపదే తిరస్కరణలను ఎదుర్కొంది. సాధారణంగా ఎన్ఆర్ఐలకు ఎదురయ్యే అనుభవమే ఇది. ఇదే సమయంలో అనారోగ్యంతో తల్లి అకాల మరణం ఆమెను మరింతషాక్‌కు గురిచేసింది. అయినా ఎక్కడా నిరాశ చెందకుండా విభిన్నంగా ఆలోచించింది. వ్యాపారంవైపు అడుగులు వేసింది. అలా 2003లో స్కాట్లాండ్‌లోని కిల్మాకోమ్‌లోని కేవలం రూ. లక్ష పెట్టుబడితో పర్యావరణ స్పృహతో, రీసైకిలింగ్ బిజినెస్ పీజీ పేపర్ కంపెనీ లిమిటెడ్‌ను స్థాపించింది. స్క్రాప్ పేపర్‌ను రీసైక్లింగ్ చేయాలనే ఆలోచనతో స్కాటిష్ ప్రభుత్వ అనుమతి తీసుకొని మరీ దీన్ని స్థాపించింది. మొదటి రెండేళ్లు పూనమ్ ఒంటరిగానే పనిచేసింది. రెండేళ్ల తర్వాత, ఒక స్నేహితుడు ఆమెతో పార్ట్ టైమ్ ప్రాతిపదికన చేరాడు. వ్యాపారం విస్తరించడంతో భర్త రూ. 1.5 కోట్ల ప్యాకేజీతో కంపెనీలో చేరడం విశేషం. యూకేలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పేపర్ కంపెనీలలో ఒకటిగా ఉంది. ఈ కంపెనీ ప్రస్తుతం ఏడాదికి 800 కోట్ల టర్నోవర్‌ను కలిగి ఉంది. ముఖ్యంగా యూరప్, అమెరికాలోని కంపెనీల నుంచి చిత్తు కాగితాలను కొనుగోలు చేసి, దాన్నుంచి మంచి నాణ్యమైన కాగితాన్ని కూడా తయారు చేసి ఇతర దేశాలకు ఎగుమతిచేస్తుంది. ఇలా పీజీ పేపర్ ప్రపంచంలోని 53 దేశాల నుండి వస్తువులను దిగుమతి, ఎగుమతులను చేస్తుంది. పీజీ కంపెనీ ఉత్పత్తులను తొలుత ఎగుమతి చేసింది ఇండియాకే. ఇక్కడితో ఆగిపోలేదు. హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్. మెడికల్‌తో సహా ఐటీ రంగంలోకి కూడా ప్రవేశించింది. దాదాపు 350 మంది ఉద్యోగులతో స్కాట్లాండ్ ప్రధాన కార్యాలయం వేదికగా తన సేవల్ని అందిస్తోంది. 7 దేశాలలో ఉన్న అనేక కార్యాలయాలతో 9 కంపెనీలున్నాయి. రానున్న కాలంలో పీజీ పేపర్ ఆదాయం రూ. 1000 కోట్లను అధిగమించాలనేది పూనమ్ గుప్తా టార్గెట్. పీజీ పేపర్ సీఈవో, యూకేలో ఉమెన్స్ ఎంటర్‌ప్రైజ్ స్కాట్లాండ్ అంబాసిడర్, అత్యంత గుర్తింపు పొందిన పారిశ్రామిక వేత్తలలో ఒకరు, యూ?కే-ఇండియా సంబంధాలలో అత్యంత ప్రభావవంతమైన 100 మంది నాయకులలో ఒకరిగా పేరొందారు పూనమ్. స్థానిక, జాతీయ , అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలకు వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తారు. భారత్‌లోని యువతుల విద్యకోసం, మహిళలను సాధికారతకు తప్పకుండా మద్దతు నిస్తున్న గొప్ప దాత కూడా. ఈమెకు ఇద్దరు కుమార్తెలు సాన్వి, అన్య, “వ్యాపారం చేయాలనే ఆలోచన మాత్రమే సరిపోదుబీ రంగంలోకి దిగాలి. పరిశోధన చేయాలి, ఎక్కడో ఒక చోట మొదలు ప్రారంభించండి లక్ష్యాలకు కట్టుబడి ఉండండి. అలాగే మీ లాభాలను కంపెనీకి తిరిగి ఇవ్వడం మర్చిపోవద్దు” - పూనం గుప్తా



## యూఎస్‌లోనే అత్యంత సంపన్న మహిళగా..ఏకంగా రూ. 75 వేల కోట్లు..!

భారతదేశంలోనే పుట్టి, పెరిగిన ఒక మహిళ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. ఆహర్నిశలు కష్టపడి కంపెనీని వృద్ధిలోకి తీసుకొచ్చింది. యూఎస్‌లోనే అత్యంత పిన్నవయస్కురాలైన మహిళా ?వ్యాపారవేత్తగా నిలవడమే గాక ఫోర్బ్స్‌లో కూడా చోటు దక్కించుకుంది. ఎవరీమె అంటే.. భారత్‌కి చెందిన నేహా నారే?డే పుట్టింది, పెరిగింది పూణేలోనే. ఆ తర్వాత యూఎస్‌లోని జార్జియా టెక్‌లో కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. అక్కడే లింక్డ్ఇన్, ఒరాకిల్ వంటి కంపెనీల్లో పనిచేసి కాన్ఫ్లూయెంట్ అనే కంపెనీని స్థాపించింది. ప్రారంభంలో గణనీయమైన ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ అనతి కాలంలోనే రూ. 75 వేల కోట్ల టర్నోవర్‌తో దూసుకువెళ్లడం ప్రారంభించింది. అలా నేహా అత్యంత పిన్న వయస్కురాలైన పారిశ్రామిక వేత్తగా, అమెరికాలో ఎనిమిదొవ అత్యంత సంపన్న మహిళగా అవతరించింది. చిన్నతనంలో తాను ఇందిరా గాంధీ, కిరణ్‌బేడి, ఇంద్రానూయి వంటి ప్రముఖులు గురించి చదవడం వల్ల విజయవంతమైన వ్యాపారవేత్తగా రాణించగలిగానని చెబుతోంది. ఆమె కంపెనీ పబ్లిక్‌గా మారిన తర్వాత 2021 నాటికల్లా రూ. 13 వేల కోట్లకు చేరుకుంది. అనూహ్యంగా ఆమె సంపద 2022లో దారుణంగా పడిపోయి దాదాపు రూ. 8 వేల కోట్ల నష్టాన్ని నష్టాలను చవిచూసింది. అయినప్పటికీ మళ్లీ కంపెనీని లాభాల బాటపట్టించింది. ప్రస్తుతం నేహా కంపెనీ నికర విలువ ఏకంగా రూ. 75 వేల కోట్లు. అంతేగాదు మార్చి 2023లో నారే?డ్ మోసాలను గుర్తించే సంస్థ ఓస్కిలార్ అనే కొత్త కంపెనీను కూడా స్థాపించింది. అంతేగాదు ఫోర్బ్స్ మ్యాగ్జైన్‌లో స్వీయ సంపన్న మహిళల జాబితాలో నేహా చోటు దక్కించుకోవడం విశేషం.

## వెల్లుల్లితో మొటిమలు మటుమాయం? నిపుణులు ఏమంటున్నారు?



వెల్లుల్లి గురించి దాదాపు తెలియని వారుండరు. మరో విధంగా చెప్పాలంటే వెల్లుల్లి లేని మసాలా వంట ఉండదు. కొంతమందికి వెల్లుల్లి వాసన నచ్చనప్పటికీ, అల్లంవెల్లుల్లి మిశ్రమం వేసిన తరువాత ఏ రెసిపీ అయినా రుచి రెట్టింపు అవ్వడమేకాదు వాసన కూడా ఘుమ ఘుమ లాడాల్సిందే. వెల్లుల్లి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే సౌందర్య పోషణగా కూడా పనిచేస్తుందంటారు. మరి ఈ విషయంలో నిపుణులు ఏమంటున్నారో చూద్దాం. ఆరోగ్యానికి వెల్లుల్లి సంజీవని: ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో పచ్చి వెల్లుల్లి తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. దీనిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల, మధుమేహం, బీపీ నియంత్రణలో ఉంటాయి. శరీరంలోని ఎర్రరక్తకణాలు వెల్లుల్లిలో ఉండే సల్ఫైడ్స్‌ను హైడ్రోజన్ సల్ఫైడ్ గ్యాస్‌గా మారుస్తుంది. ఈ గ్యాస్ రక్తపోటును నియంత్రిస్తుంది.అందేకాదు ఇది చర్మాన్ని కాపాడుతుంది. మొటిమలు, యాక్నె, నల్లమచ్చలు వంటివి బాధిస్తున్నా, చర్మం మెరవాలన్నా పచ్చి వెల్లుల్లి మంచి ఉపశమనంగా పనిచేస్తుంది.వెల్లుల్లికి రక్తాన్ని శుద్ధిచేసే గుణం ఉంది. వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఖాళీ కడుపుతో నాలుగు వెల్లుల్లి రెబ్బలు తినటం వల్ల మధుమేహాన్ని నయం చేస్తుంది. అలాగే రోజుకు కొన్ని వెల్లుల్లి రెమ్మలు తింటే జిమ్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే బరువు తగ్గవచ్చుట. వెల్లుల్లి జీర్ణాశయంలోని ఎంజైములను ఉత్తేజపరచడం వల్ల బరువు తగ్గుతారు. కొవ్వును కరిగించడంలో వెల్లుల్లికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. మ్యాజిక్ క్యూర్.. పచ్చి వెల్లుల్లి మొటిమలకు మ్యాజిక్ క్యూర్‌గా పనిచేస్తుందని ఇటీవల ఒక .బ్యూటీ ఇన్‌ఫ్లుయెన్సర్ ఇన్‌స్టా వీడియో వైరల్ అయిందితన 'రాత్రిపూట చర్మ సంరక్షణ దినచర్య'లో భాగంగా పచ్చి వెల్లుల్లి రెబ్బను తీసుకొని నేరుగా తీసుకుంది. పచ్చి వెల్లుల్లిని తీసుకోవడం చాలా మొండి సిస్టిక్ మొటిమలకు కూడాపనిచేస్తుందని కొంతమంది పేర్కొన్నారు. కొంతమంది కూడా సానుకూలంగా స్పందించగా మరికొందరు మాత్రం తమ సమస్యమరింత ఎక్కువైందని కమెంట్ చేయడం గమనార్హం.

## అరటి ఆకులతో హల్వా ట్రై చేశారా?

హల్వా అంటే ఎవరికి ఇష్టం ఉండదు. అలాంటి హల్వాని సంప్రదాయ పద్ధతిలోనే కాకుండా వివిధ పండ్లతో, కూరగాయాలతో చేయటం చూశాం. ఎన్నో రకాల మేళవింపులతో కూడిన హల్వాలను రుచి చూశాం. అయితే ఇలా ఆకులతో చేసే హల్వాని మాత్రం చూసి ఉండరు. అందులోనూ అరటి ఆకులతో చేయడం గురించి విన్నారు. ఎలా చేస్తారంటే..అత్యంత ప్రజాధరణ పొందిన స్వీట్సలో హల్వా ఒకటి. దాని రుచే అదిరిపోతుంది. అలాంటి హల్వాని ఆకులతో చేయడం ఏంట్రాబాబు అనుకుంటున్నారా..!. అందుకు సంబంధించిన ఆసక్తికర వీడియో ఒకటి నెట్టింట చక్కెర్లు కొడుతోంది. అందులో ఒక వ్యక్తి ఈ వైరైటీ హల్వాని చేసి చూపించాడు. అతను అరటి ఆకులను చక్కగా శుభ్రం చేసి మధ్యలోని కాండాన్ని తొలగించాడు. ఆ తర్వాత ఆకులన్నింటిని చక్కగా చదును చేసి రోల్ చేశాడు. ఇక దాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేశాడు. వాటన్నింటిని మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి జ్యూస్‌లా. ఆ తర్వా స్టవ్‌పై కడాయి పెట్టి నెయ్యి వేసి, అందులో ఈ జ్యూస్‌ని వేసి పచ్చి వాసన పోయి దగ్గర పడేలా మరిగించాడు. ఆ తర్వాత పంచాదర కలిపి మరింత దగ్గర పడేలా చేశాడు. ఈలోగా కార్న్‌ఫ్లోర్‌ని చక్కగా నీటిలో కలిపి పేస్ట్ చేసుకున్న మిశ్రమాన్ని ఈ మిశ్రమంలో కలపాడు. ఇకి హల్వాల దగ్గర పడుతుందనంగా డ్రైఫ్రూట్స్‌తో అలంకరించాడు. చివరిగా ఆ హల్వాని టేస్ట్ చేసి వ్యక్తి పైకి బాగుందని అన్నా..అతని ఎక్స్‌ప్రెషన్స్ మాత్రం బాలేదన్నట్లు ఇబ్బందికరంగా ఉన్నాయి. దీంతో నెటిజన్లు బాస్ ఏంటి చెత్త ప్రయోగాలు..బాగుందంటూ హావభావాలు వేరేలా ఉన్నయేంటీ అని చివాట్లు పెడుతూ పోస్టులు పెట్టారు.

## 'ఏదైనా చేయాలి.. అది ఇతరుల కంటే భిన్నంగా ఉండాలి'..



కల ఉన్న చోట కష్టం ఉంటుంది. 'మరింత కష్టపడతాను' అంటూ ముందుకువెళ్లాలి. లక్ష్యం ఉన్న చోట సవాలు ఎదురొస్తుంది. సర్కియైన జవాబు చెప్పి ఆ సవాలును వెనక్కి పంపించాలి. ఇందుకు నిలువెత్తు ఉదాహరణ శ్రుతి మల్హోత్రా. జార?ండ్‌లోని రాంచికి చెందిన శ్రుతి ఎన్నో చిన్న బ్రాండ్‌లను పెద్ద సక్సెస్ చేసింది. సక్సెస్‌కు సర్కియైన అడ్రస్‌గా పేరు తెచ్చుకుంది. శ్రుతి మల్హోత్రా బాల్యంలోకి వెళితే..ప్రతిరోజు రాత్రి నలుగురు అక్కాచెల్లెళ్లు వార్తలు వినడానికి రేడియో ముందు కూర్చునేవారు. కొత్త విషయాలు, ఆసక్తికరమైన విషయాలను రూల్ నోట్ ?ుడ్‌లో రాసుకునేవారు. మరుసటి రోజు తండ్రితో వాటి గురించి చర్చించేవారు. తండ్రి వాటి గురించి మరిన్ని కొత్త విషయాలు వివరంగా చెప్పేవాడు. శృతి తండ్రి పిల్లలకు తరచుగా చెప్పే మాట.. 'స్వతంత్రంగా ఉండండి' 'పెద్ద కలలు కనడానికి వెనకాడ వద్దు' 'ఈ ప్రపంచంలో మీకు అత్యున్నత స్నేహితుడు.. విద్య' తండ్రి మాటలు అక్షరాలా ఆచరించడం వల్లే పదిమందీ మెచ్చుకునే స్థాయికి ఎదిగింది శృతి మల్హోత్రా. మిషనరీ స్కూల్ నుంచి దిల్లీ యూనివర్శిటీలో చదువుకోవడం వరకు 'స్వతంత్రంగా ఉండడం' అనే లక్షణాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. దీనివల్ల ఆమె చాలామందికి'రెబెల్'గా కనిపించేది. 'ఏదైనా చేయాలి. అది ఇతరుల కంటే భిన్నంగా ఉండాలి' అనే లక్ష్యాన్ని కాలేజీ రోజుల్లోనే నిర్దేశించుకుంది మల్హోత్రా. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో చదువు పూర్తయిన తరువాత ఫ్యాషన్ కంపెనీ 'బెనెటన్'తో ప్రొఫెషనల్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. నైకీ, ప్లానెట్ స్పోర్ట్స్‌లో కూడా అద్భుతమైన ఇన్నింగ్స్‌ను ప్రదర్శించింది. స్థూలంగా చెప్పాలంటే ఫ్యాషన్, లైఫ్ స్టైల్ జైనింగ్‌లలో ప్రత్యేకమైన పేరు తెచ్చుకుంది. 2007లో ఎథికల్ బ్యూటీబ్రాండ్ 'ది బాడీ షాప్'లో చేరింది. ఇది తన ప్రయాణ గతిని మార్చేసింది. రిటైల్, సేల్స్, డిస్ట్రిబ్యూషన్‌లలో అడుగుడుగునా పురుషాధిక్యత కనిపించే కాలంలో మహిళలు అడుగు వేసి నిలదొక్కుకోవడం అంత సులభం కాదు. 'వేరే వారి కంటే ఒక మెట్టుకింద ఉండడానికి నేను ఎప్పుడూ ఇష్టపడలేదు. సవాలుగా తీసుకున్నాను. రెట్టింపు కష్టపడ్డాను' అంటుంది మల్హోత్రా. ఆ కాలంలో బ్యూటీప్రొడక్ట్స్‌కు సంబంధించిన రిటైల్ బిజినెస్ ఫార్మసీ, డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లలో మాత్రమే కనిపించేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'జీరో నుంచి ప్రయాణంప్రారంభించాను' అంటుంది మల్హోత్రా. 'ఈ రంగాన్ని ఎందుకు ఎంచుకున్నావు?' అనే సన్నాయి నొక్కుల నుంచి 'ఈ రంగంలో పెద్ద పేరున్న మహిళ' అనే ప్రశంస వరకు శృతి మల్హోత్రా ఎంతో ప్రయాణం చేసింది. ఎన్నో పాఠాలు నేర్చింది. ఎందరికో గుణపాఠాలు చెప్పింది. 'క్వెస్ట్ రిటైల్' గ్రూప్ సీయీవోగా ఎంతో పేరు తెచ్చుకుంది. 'శృతి మల్హోత్రా సీయీవో మాత్రమే కాదు ఎన్నో బ్రాండ్స్‌ను విజయవంతం చేసిన డ్రైవింగ్ ఫోర్స్' అంటాడు ఫ్యాషన్ కంపెనీ లకొస్టే ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీయీవో రాజేష్ జైన్. తన సక్సెస్‌కు కారణం తల్లిదండ్రులు అని చెబుతుంది మల్హోత్రా. చదువు చెప్పించడం నుంచి కలల సాధనలో వెన్నుదన్నుగా నిలవడం వరకు వారి పాత్ర ఎంతో ఉందని చెబుతోంది. 'వృత్తి జీవితంలో ఎంతోమంది మేల్ కొలీగ్స్‌తో పనిచేశాను. ఎప్పుడూ ఎవరితోటీ సమస్య రాలేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు అవకాశం లేకపోవడమే అసలు సమస్య. మహిళలకు సమానావకాశాలు కల్పించడం విషయంలో ఎన్నోసార్లు పోరాడాను' అంటుంది మల్హోత్రా. 'మీరు ఎక్కడి నుంచి వచ్చారు అనేది ముఖ్యం కాదు. మీరు ఎక్కడికి వెళుతున్నారన్నది ముఖ్యం'అనేది శృతి మల్హోత్రాకు ఇష్టమైన మాట.

## నిద్రలేమి సమస్యా? అయితే ఇలా చేయండి!

ఆరోగ్యంగా ఉండటానికి సరైన తిండి, శరీరానికి తగిన వ్యాయామాలతో పాటు కంటినిండా నిద్ర కూడా అంతే అవసరం. అయితే కొంతమంది జీవన శైలి, మానసిక ఒత్తిడి కారణంగా సరిగా నిద్రపోవడం లేదు. అటువంటి వారు నిద్రమాత్రలకు బదులు ఆరోగ్య నిపుణులు సూచించిన కొన్ని పండ్లు తీసుకుంటే సరిపోతుంది. ఈ పండ్లను తీసుకోవడం వల్ల నిద్రలేమి సమస్య నుంచి సులభంగా ఉపశమనం పొందవచ్చు. అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా కూడా శరీరాన్ని రక్షించుకోవచ్చు.అరటి పండు..నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే సమయంలో అరటిపండును తీసుకోవడం మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అరటిపండులో ఉండే గుణాలు శరీరంలోని ఒత్తిడిని సులభంగా తగ్గించి నిద్రను మెరుగుపరిచేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా జీర్ణ వ్యవస్థను కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈరోజు అరటి పండ్లతోపాటు చెర్రీలను కూడా తీసుకోవడం వల్ల నిద్రలేమి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. కొంతమంది తరచుగా నిద్ర పోయినట్లే పోయి మేల్కొంటారు. అయితే ఇలాంటివారు చెర్రీస్‌తో తయారు చేసిన రసాన్ని తాగడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు. అంతేకాకుండా ఈ రసాన్ని తాగడం వల్ల చర్మం కూడా ఎంతో ఆరోగ్యంగా ఉంటుంది.నిద్రను మెరుగుపరిచేందుకు పైనాపిల్ జ్యూస్ ఎంతగానో సహాయపడుతుంది. కాబట్టి నిద్రలేని సమస్యలతో బాధపడేవారు తప్పకుండా ఈ జ్యూస్‌ను తీసుకోవాలి. పైనాపిల్‌లో మెలటోనిన్, విటమిన్ సి, మెగ్నీషియం అధిక పరిమాణంలో లభిస్తాయి. కాబట్టి ప్రతిరోజు దీనితో జ్యూస్‌ని తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. బొప్పాయి.. బొప్పాయిలో విటమిన్ సి, ఇ, ఫోలేట్, పొటాషియం వంటి పోషకాలు హాయిగా నిద్ర పోయేలా చేస్తాయి. నిద్ర లేమి సమస్యలతో ఇబ్బంది పడేవారు రాత్రి పూట బొప్పాయి తింటే మంచి ఫలితం ఉంటుంది.



# ఆంధ్రప్రదేశ్

## ఎపిలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

### ఈదురుగాలులు వీచే అవకాశం

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమరావతి : రాష్ట్రంలో మంగళవారం అక్కడక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సోమవారం వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాల సూచన ఉందని తెలిపింది. ఇక కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో పాటు వర్షాలు పడతాయని తెలిపింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వైఎస్సార్ కడప జిల్లాలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాల కురుస్తాయని సూచించింది. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడ వద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే భారీ హోర్డింగ్స్ ప్రాంతాల్లో ఉండ వద్దని ప్రజలకు తెలిపింది. ల్గ÷తులు, పశువుల కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు వినిపించగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని స్పష్టం చేసింది. తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో 42 - 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎండ తీవ్రత కొనసాగనుందని తెలిపింది. పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 40 - 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నెలకొంటాయని చెప్పింది. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత కొనసాగనుందని విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. అయితే సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరులో 41.7 డిగ్రీలు, చిట్యాలలో 41.4 డిగ్రీలు, ఎస్. రాయవరంలో 41.2 డిగ్రీలు, పెదపారుపూడిలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయిందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

## పచ్చిరొట్ట పంటల సాగుతో భూమి సారవంతం

### వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి సూచన

హైదరాబాద్,జూన్9 : వ్యవసాయ భూముల్లో సేంద్రియ కర్బన పదార్థం తగ్గిపోవడం, నేల గట్టిపడటం, నీటి నిల్వ సామర్థ్యం క్షీణించడం, రసాయన ఎరువుల వినియోగం పెరగడం వంటి సమస్యలను అధిగమించేందుకు రైతులు పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి సూచించారు. జనుము, జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలను ప్రధాన పంటలకు ముందు లేదా రెండు పంటల మధ్యకాలంలో సాగు చేసి, పూత దశలో భూమిలో కలియదున్నడం ద్వారా నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెరిగి భూమి సారవంతమవుతుందని తెలిపారు. ఈ పంటలను భూమిలో కలపడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఉపయోగకరమైన సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల వేర్ల వద్ద అభివృద్ధి చెందే సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని భూమిలో స్థిరపరచి మొక్కలకు సహజ పోషకాలను అందిస్తాయని తెలిపారు. దీంతో రసాయన ఎరువుల అవసరం తగ్గి సాగు ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. మామిడి, జామ, నిమ్మ, కొబ్బరి, ఆయిల్ పామ్ వంటి పండ్ల తోటల మధ్య పచ్చిరొట్ట పంటలను సాగు చేసి వాటిని కలియదున్నడం లేదా చెట్ల చుట్టూ పరిచి ఉంచడం ద్వారా సహజసిద్ధమైన మల్చింగ్ ఏర్పడుతుందని తెలిపారు. దీనివల్ల భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో పాటు కలుపు మొక్కల పెరుగుదల తగ్గి వేర్ల అభివృద్ధి మెరుగుపడుతుందని చెప్పారు. చ్చిరొట్ట పంటలను పూత దశకు ముందే భూమిలో కలియదున్నడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడి సుస్థిర వ్యవసాయానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవ గీతానికి చిరస్మరణీయ నివాళి

### ఘట్కేసర్‌లో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటు

### స్మృతి వనం పనులను పరిశీలించిన మంత్రి అడ్లూరి

హైదరాబాద్,జూన్9 : తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో ప్రజల్లో రగిలించిన మహాకవి, ప్రజా గాయకుడు, రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్ పక్కన ఏర్పాటు చేయనున్న 'అందెశ్రీ స్మృతి వనం' స్థలాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం అని పేర్కొన్నారు. తన గీతాలు, రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు అందెశ్రీ సేవలకు గుర్తింపుగా ఈ స్మృతి వనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఘట్కేసర్‌లో ప్రభుత్వం ఎకరం 22 గుంటల భూమిని ఇందుకోసం కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ఇది కేవలం ఒక ఉద్యానవనం మాత్రమే కాకుండా, తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే స్మారక క్షేత్రంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. అందెశ్రీ జీవిత విశేషాలు, ఉద్యమంలో ఆయన పాత్ర, సాహిత్య సేవలను భావితరాలకు చేరవేసే విధంగా స్మృతి వనాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను, ఉద్యమ స్ఫూర్తిని యువతకు పరిచయం చేసే జ్ఞాపక చిహ్నంగా ఈ ప్రాంగణం నిలవాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... స్మృతి వనం అభివృద్ధి కోసం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల పక్రియ ప్రారంభించి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం స్మృతి వనాన్ని నిర్వహణ కోసం హెచ్ఎండీఏకు అప్పగించనున్నట్లు చెప్పారు. స్మృతి వనంలో అందెశ్రీ విగ్రహం, ఆయన జీవిత చరిత్రను ప్రతిబింబించే శిలాఫలకాలు, తెలంగాణ ఉద్యమ గీతాల ప్రదర్శన గ్యాలరీ, సాహిత్య వేదిక, పచ్చదనంతో కూడిన ప్రత్యేక ఉద్యానవనం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని గీతంగా మలిచిన మహాకవి అందెశ్రీకి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ గౌరవం, తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

# స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం

### గాయపడ్డ వారికి 10 లక్షల చొప్పున సాయం

### ప్రమాదఘటన జరగ్గానే కేంద్ర మంత్రుల రాక

### మంత్రి లోకేశ్ వెల్లడి



విశాఖపట్నం,జూన్9 : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల పరిహారం అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. గాయపడినవారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని తెలిపారు. మంగళవారం విశాఖపట్నంలో మంత్రి లోకేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌లో నిన్న జరిగిన ఘటన చాలా బాధాకరమని అన్నారు. 4.15 నిమిషాలకు ఈ ప్రమాదం జరిగిందని తెలియగానే కేంద్రమంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు ఇక్కడికి వచ్చారని తెలిపారు. ఈ ఘటనలో 9 మంది చనిపోయారని... 6 మంది గాయపడ్డారని చెప్పారు. తాము పరిహారం ఇవ్వడానికి ఇక్కడకు రాలేదని... శాశ్వతంగా బాధితులకు అండగా ఉంటామని లోకేశ్ భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్మికులకు పూర్తిగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. తమకు ఉన్న చిత్తశుద్ధితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. తమకు వాట్సాప్ గ్రూప్ ఒకటి ఉందని.. రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా తాము తక్షణమే అక్కడకు వెళ్తామని.. అందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఉన్నారని ప్రస్తావించారు. ఉక్కు కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాటిచ్చారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు'తో స్టీల్ ఎ÷-లాంట్‌ని సాధించుకున్నామని వ్యాఖ్యానించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో స్టీల్ ప్లాంట్ ఏర్పడిందని ప్రస్తావించారు. ఈ ఘటనపై కార్మిక సంఘాల నేతలు కావాలని అపోహలు సృష్టించొద్దని అన్నారు. 24 గంటలు గడవక ముందే ఇలా మాట్లాడటం భావ్యం కాదని చెప్పారు. విశాఖ ఉక్కును కాపాడాలని కార్మికులు తమను కోరుతున్నారని అన్నారు. విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్రలో పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయని వివరించారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలో విశాఖ స్టీల్‌కు సంక్షోభం వస్తే.. ఆనాడు మనం కాపాడుకున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లోకేశ్ చురకలు అంటించారు. 'ఇంత భారీ ప్రమాదం జరిగితే ఇక్కడకు ప్రతిపక్ష టీమ్ లెవెన్ నుంచి కెప్టెన్ వచ్చారా..?. టీం లెవెన్ కెప్టెన్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదు. మాకు 124 స్థానాలు ఇచ్చిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాకు ఉంది. పరదాలు కట్టుకొని వెళ్లే వారికి కాదు' అని లోకేశ్ సెటైర్లు గుప్పించారు

## స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై రాజకీయాలా?

### వైసిపి తీరుపై మండిపడ్డ ఎంపి కలిశెట్టి

విశాఖపట్నం,జూన్9 : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాద ఘటనపై వైసీపీ వ్యవహరిస్తున్న తీరు పట్ల విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. నాడు ఎల్‌జీ పాలిమర్స్ బాధితులను గాలికొదిలేసిన వైసీపీ.. నేడు స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, శాశ్వత ఉద్యోగం ఇచ్చిన మానవతా ప్రభుత్వం ఈ కూటమి సర్కారు అని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పారిశ్రామిక రక్షణ గాల్లో దీపమైతే.. నేడు బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అహర్నిశలూ శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ప్రమాదాన్ని కూడా రాజకీయ లబ్ది కోసం వాడుకుంటూ, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న శవరాజకీయాలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. వైసీపీ ఐదేళ్ల తుగ్లక్ పాలనలోని పారిశ్రామిక నిర్లక్ష్యాన్ని గుర్తు చేస్తూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమంతోపాటు స్టీల్ ఎ÷-లాంట్ మనుగడ కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని ఆయన వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఉదంతాన్ని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వివరించారు. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్ వ్యవహరించిన తీరును ఆయన ఎండగట్టారు. అందుకు భిన్నంగా ప్రస్తుతం కూటమి సర్కార్ స్పందించిందని గుర్తు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మిక సోదరుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం దేశ పారిశ్రామిక చరిత్రలోనే ఒక రికార్డు అని అభివర్ణించారు. ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి వివరించారు. ?ఇంతటి ఉదారతతో కార్మిక లోకానికి అండగా నిలిచిన కూటమి ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి.. వైసీపీ నేతలు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని ఎంపీ కలిశెట్టి నిప్పులు చెరిగారు. విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణను పక్కన పెట్టి.. దాని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను ఎంపీ కలిశెట్టి సోదాహరణగా వివరించారు. ఈఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ప్రజా ఉద్యమంగా యోగాంధ్ర..

### స్వర్ణాంధ్ర, ఆరోగ్యాంధ్ర దిశగా ముందడుగు వేద్దాం

### ప్రతిఒక్కరూ జీవనశైలిలో యోగాను భాగం చేసుకోవాలి

### పండగలా ఊరూవాడా యోగా శిక్షణ కార్యక్రమాలు

### జిల్లాలో అందుబాటులో 10 వేల మంది ట్రైనర్లు

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,జూన్9 : యోగాంధ్ర-2026లో భాగంగా ప్రజా ఉద్యమంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. స్వర్ణాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని, ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. విజయవాడ అర్బన్ పరిధిలో బీఆర్‌టీఎస్ రోడ్డులో మంగళవారం ఉదయం యోగా అభ్యసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. వివిధ శాఖల అధికారులు, ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ ప్రధానమంత్రి, గౌరవ ముఖ్యమంత్రి దిశానిర్దేశర, స్ఫూర్తిపథంతో జిల్లాలో ఊరూవాడా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు, బెరం పార్కు తదితర ప్రాంతాలతో పాటు ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు ఇలా ప్రతిచోటా యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరినీ ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, ఆరోగ్యాంధ్ర నిర్మాణం లక్ష్యంగా రాష్ట్రమంతటా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఆయుష్, వైద్య ఆరోగ్యం, పురపాలక, రెవెన్యూ, పంచాయతీరాజ్, యువజన సంక్షేమం, విద్య ఇలా వివిధ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయని.. వీటిలో సమాజంలోని ప్రతిఒక్కరినీ భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో రోజుకో థీమ్‌తో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే పోలీస్ థీమ్ యోగా జరిగిందని తెలిపారు. జిల్లాలో దాదాపు పదివేల మంది యోగా ట్రైనర్లు ఉన్నారని.. వీరి శిక్షణ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోజూ 45 నిమిషాలు యోగాను అభ్యసిస్తే జీవనశైలి వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని.. 60 నుండి 70 శాతం వరకు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. ప్రతి కుటుంబంలో అందరూ యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగాభ్యాసం ద్వారా ఒత్తిడి తగ్గడంతో పాటు ఏకాగ్రత, శక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఃార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్నప్రియదర్శిని, యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్, డీఎంహెచ్‌వో డా. జె.ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్జరీ సంతకాల కేసు.. మమతాబెనర్జి ఇంట్లో సీఐడీ సోదాలు..!

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, అసెంబ్లీలో ఎమ్మెల్యేల తిరుగుబాటు, పార్లమెంట్‌లో ఎంపీల తిరుగుబాటుతో ఇప్పటికే పీకల్లోతు




కష్టాల్లో ఉన్న మమతాబెనర్జీకి మరో తలనొప్పి వచ్చిపడింది. శాసనసభ్యుల సంతకాల ఫోర్జరీ కేసు దర్యాప్తులో భాగంగా ఆ రాష్ట్ర సీఐడీ అధికారులు మంగళవారం మమతా బెనర్జీ నివాసానికి చేరుకున్నారు. కోల్‌కతా లోని 30దీ, హరీశ్ ఛటర్జీ స్ట్రీట్‌లో ఉన్న ఆమె నివాసంలో సోదాలు నిర్వహించేందుకు సీఐడీ బృందం అక్కడకు వెళ్లడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. మమత ఇంటి చిరునామాతో తృణమూల్ కాంగ్రెస్ అధికారిక పార్టీ కార్యాలయం కూడా నమోదై ఉన్నందున తాము ప్రాంగణాన్ని తనిఖీ చేయాల్సి ఉందని సీఐడీ అధికారులు పేర్కొన్నారు. అయితే మాజీ ఎంపీ సుభాశిష్ చక్రవర్తితో సహా పలువురు టీఎంసీ నాయకులు అధికారులను లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో నివాసం వెలుపల కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఇద్దరూ ప్రస్తుతం ఇంట్లో లేరని, కాబట్టి సోదాలకు అనుమతించలేమని, ఒకట్రెండు రోజుల తర్వాత రావాలని సుభాశిష్ చక్రవర్తి కోరారు. అయితే దీనిపై సీఐడీ అధికారులు అభ్యంతరం వ్యక్తంచేశారు. తాము చట్టప్రకారం విచారణకు వస్తే అడ్డుకోవడం నేరమని స్పష్టంచేశారు. కొద్దిసేపు ఘర్షణ తర్వాత సీఐడీ బృందం లోపలికి వెళ్లింది. మే 20న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ స్పీకర్‌కు తృణమూల్ కాంగ్రెస్ తరఫున ఒక లేఖ సమర్పించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా సోవన్ దేబ్ ఛటోపాధ్యాయను ఎన్నుకుంటూ ఈ లేఖను ఇచ్చారు. అయితే ఈ లేఖపై ఉన్న తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ టీఎంసీ ఎమ్మెల్యేలు రితబ్రతా బెనర్జీ, సందీపన్ సాహా సంచలన ఆరోపణలు చేశారు. ఈ వివాదం ముదిరి ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఈ ఫోర్జరీ వ్యవహారంపై కోల్‌కతాలోని హేర్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదుకాగా.. బెంగాల్ ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. స్పీకర్‌కు పంపిన ఆ వివాదాస్పద లేఖపై పార్టీ జనరల్ సెక్రెటరీ అభిషేక్ బెనర్జీ సంతకం చేసినందున విచారణకు హాజరుకావాలంటూ సీఐడీ ఆయనకు పలుమార్లు సమన్లు జారీ చేసింది. అయితే అనారోగ్య కారణాలను చూపుతూ అభిషేక్ బెనర్జీ వ్యక్తిగతంగా హాజరుకాకుండా.. తనకు 15 రోజుల సమయం కావాలని కోరారు. ఈ నేపథ్యంలోనే సీఐడీ నేరుగా మమతా బెనర్జీ ఇంటికి రావడం బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

## దేవాలయాల్లో చేనేత శాలువాలే అందించాలి

### మంత్రి కొండా సురేఖకు గజం అంజయ్య వినతిపత్రం

### సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ

### ఆలయాల్లో చేనేత వస్త్రాల వినియోగం పరిశీలిస్తామని హామీ

హైదరాబాద్,జూన్9 : రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు ఆశీర్వచనంగా చేనేత రంగం ద్వారా తయారు చేసిన శాలువాలను మాత్రమే అందించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చేనేత కళాకారుడు గజం అంజయ్య దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖను జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా చేనేతకారులు స్వచ్ఛమైన నూలుతో తయారైన శాలువాతో మంత్రిని సత్కరించారు. యాదాద్రి, భద్రాచలం, బాసర, వేములవాడ తదితర ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సేవల్లో పాల్గొనే భక్తులకు అందించే శాలువాలు ప్రస్తుతం పెద్దమొత్తంలో మరమగ్గాలు, మిల్లుల్లో కృత్రిమ నూలుతో తయారవుతున్నాయని ఆయన మంత్రి సురేఖకి వివరించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా దేవాలయాల్లో ఎ÷-లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధిస్తున్న పరిస్థితుల్లో సింథటిక్ నూలుతో తయారైన శాలువాల వినియోగాన్ని కొనసాగించడం సముచితం కాదని తన అభిప్రాయాన్ని మంత్రి సురేఖ కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో చేనేత రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. విత్రమైన దేవాలయాల్లో భక్తులకు అందించే శాలువాలు స్వచ్ఛమైన పత్తి లేదా పట్టు చేనేత వస్త్రాలతో తయారైతే వాటికి మరింత ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువ చేకూరుతుందని అంజయ్య మంత్రి సురేఖ గారికి తెలిపారు. అదే సమయంలో ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు తెలంగాణ చేనేత సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని వివరించారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో చేనేతతో తయారైన పవిత్ర శాలువాల వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం తగిన విధాన నిర్ణయం తీసుకోవాలని అంజయ్య మంత్రిగారికి విజ్ఞప్తి చేశారు. గజం అంజయ్య చేసిన సూచనలు, ప్రతిపాదనలను మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్వీకరించారు. ఈ దిశగా కృషి చేస్తున్న గజం అంజయ్యను మంత్రి సురేఖ అభినందించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భారతీయ సంప్రదాయాల సంరక్షణలో చేనేత కార్మికులు పోషిస్తున్న పాత్ర అమూల్యమైనదని ఆమె కొనియాడారు. ఆలయాల్లో చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయ పరిరక్షణతో పాటు చేనేత కార్మికుల జీవనోపాధికి ఊతం లభిస్తుందని అన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి చేనేత రంగానికి మద్దతుగా తగిన చర్యలు చేపడతామని గజం అంజయ్యకు హామీ ఇచ్చారు. చేనేత రంగ పురోగతికి, చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## ఇది కేవలం అధికారం కోసం చేస్తున్న ద్రోహం.. పార్టీలో తిరుగుబాట్లపై టీఎంసీ కామెంట్

పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుత పరిణామాలపై తృణమూల్ కాంగ్రెస్ (ఀఱజ) స్పందించింది. ఇటీవల టీఎంసీ చీఫ్ విప్‌గా నియమితులైన కల్యాణ్ బెనర్జీ (ఖఱశ్రీఱఖఅ దీఱఅవతీయవవ) మాట్లాడుతూ.. గతంలో మమతాబెనర్జీ (ఝఎఝ దీఱఅవతీయవవ) నాయకత్వాన్ని ఆకాశానికెత్తిన వారే ఇప్పుడు పార్టీ అధికారంలో లేదనే సాకుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం అధికారం కోసం చేస్తున్న ద్రోహమని ఆయన ధ్వజమెత్తారు. ఈ తిరుగుబాటు నేతలకు తమ పదవులకు రాజీనామా చేసే మళ్లీ గెలిచే దమ్ముందా..? అని ఆయన ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్‌లో అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జి నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు, పార్లమెంటులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసినట్లు రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ దస్తిదార్ ప్రకటించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. అధికార తృణమూల్ తిరిగి తన అధికారాన్ని నిలబెట్టుకోలేకపోయింది. అయితే ఈ ఓటమి అనంతరం టీఎంసీలో అసమ్మతి జ్వాలలు మిన్నంటాయి.




# వివాదాస్పద సన్నివేశాలు తొలగించాం

## పెద్ది డైరెక్టర్ బుచ్చిబాబు వెల్లడి

'పెద్ది'లో వివాదాస్పదమైన సన్నివేశాలను తొలగించినట్లు దర్శకుడు బుచ్చిబాబు వెల్లడించారు. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ ఇందులోని కొన్ని సన్నివేశాలపై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల క్షమాపణలు చెప్పిన బుచ్చిబాబు ఆయా సన్నివేశాలను తొలగిస్తామని చెప్పారు. వాటిని తొలగించినట్లు తాజాగా తెలిపారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీనిపై వివరణ ఇచ్చారు. 'చాలా మంది ఇలాంటి మంచి కథలో జాన్వీ కపూర్ ట్రాక్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు. సినిమాకు ఆ పాత్ర అనవసరమని కామెంట్ చేశారు. నా గత సినిమాతో (ఉప్పెన) పోలిస్తే 'పెద్ది' కథను నేను పూర్తి భిన్నంగా రాసుకున్నా. కొండల ప్రాంతంలో మారుమూల గ్రామం నుంచి వచ్చిన వ్యక్తి పెద్ది. మొదట అతడిలో మొరటుతనాన్ని చూపించి.. సినిమా చివరిలో దాన్ని సరిదిద్దాలని భావించాను. అతడు పెరిగిన వాతావరణం వల్ల అలా ఉన్నాడని.. అతడు మారడానికి అమ్మాయి ప్రేమ కూడా ఓ కారణం కావాలని ఆమె పాత్రను రాశాను. అయితే, స్క్రీన్‌ప్లేలో కొన్ని సన్నివేశాలు అపార్థానికి దారితీశాయి. దీంతో అందరూ ఆ పాత్రను తప్పుగా అర్థం చేసుకున్నారు. విడుదల అనంతరం వచ్చిన విమర్శలను మేం పరిగణనలోకి తీసుకున్నాం. ఆ సన్నివేశాలను గుర్తించి సినిమా నుంచి తొలగించాం అని బుచ్చిబాబు వివరించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పించారు. ఆయనకు జోడీగా జాన్వీకపూర్ అచ్చియమ్మ పాత్రలో కనిపించారు. ఆమె పాత్రను గ్లామర్‌కే పరిమితం చేశారని పరిచయ సన్నివేశాల్లోనూ ఆమెను చూపిన విధానంపై విమర్శలు వచ్చాయి. ఈ వివాదం పక్కన పెడితే జూన్ 4న విడుదలైన ఈ చిత్రం ఇప్పటి వరకూ రూ.315 కోట్లు రాబట్టింది. అయితే, ఈ సినిమాలో జాన్వీ కపూర్ సీన్స్ తో పాటు సెకండాఫ్ లో కొన్ని పాత్రల ఎండింగ్ సరిగా లేదని కొద్ది రోజులుగా విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రేక్షకుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా చిత్ర బృందం ఈ సినిమాలో కొన్ని కీలక మార్పులు చేయబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం.. 'పెద్ది' సినిమా లెంత్, అలాగే కొన్ని సీన్స్ విషయంలో వస్తున్న మిశ్రమ స్పందనను దృష్టిలో ఉంచుకుని మేకర్స్ కొన్ని సీన్లను డిలీట్ చేసి, మరికొన్ని కొత్త సీన్లను జత చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా సెకండాఫ్ లో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ పోషించిన 'గౌరినాయుడు' ఎ÷-లాష్‌బ్యాక్ సీన్స్‌ను కొన్నింటిని తొలగించనున్నారట. ఈ సీన్స్ సినిమా ఎ÷-లోను కాస్త నెమ్మదించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అభిమానులకు సర్ప్రైజ్ ఇస్తూ రామ్ చరణ్, జగపతి బాబుల మధ్య ఉండే మరికొన్ని కీలకమైన సీన్లను యాడ్ చేయబోతున్నారట. ఈ మార్పులన్నింటినీ పూర్తి చేసిన తర్వాత చిత్ర యూనిట్ ఈ కొత్త వర్షన్‌ను మళ్లీ సెన్సార్ చేసి థియేటర్లలో పాత వర్షన్ ను తీసేసి, ఈ కొత్త వెర్షన్‌ను అప్‌లోడ్ చేయనున్నారు. ఈ సరికొత్త మార్పులతో ఫుట్ ఫాల్స్ పెరుగుతాయని టీమ్ భావిస్తోంది.



# రామ్‌చరణ్ నటన మైండ్ బ్లోయింగ్


## పెద్దిపై బన్నీ ప్రశంసలు

వివాదాల నడుమ బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతున్న 'పెద్ది'పై ప్రశంసలు కూడా పెద్ద ఎత్తున విన్పిస్తున్నాయి. ఇలాంటి టైమ్ లో అల్లు అర్జున్ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. సినిమా విడుదలై ప్రేక్షకుల నుంచి స్పందన వస్తున్న వేళ, స్వయంగా సినిమా చూసిన బన్నీ తన అభిప్రాయాన్ని పంచుకోవడం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. 'పెద్ది' చూసిన తర్వాత రామ్ చరణ్ నటన గురించి అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలు మెగా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బన్నీ తన పోస్ట్ లో చరణ్ పర్ఫార్మెన్స్ మైండ్ బ్లోయింగ్ గా ఉందని చెప్పారు, అలాగే చెర్రీ పెద్ది పాత్రలో ఇంటెన్స్ గా, సహజంగా, అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ తో ఆకట్టుకున్నాడని, డ్యాన్స్ లో కనిపించిన గ్రేస్ అన్నీ కలిసి ఒక పూర్తి స్థాయి నటుడిగా చరణ్ ను మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. తన సోదరుడి విజయాన్ని చూసి గర్వంగా ఉందని కూడా అల్లు అర్జున్ పేర్కొన్నారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన నటన బలంగా నిలిచిందని చెప్పారు. అలాగే జాన్వీ కపూర్ తో పాటు మిగతా నటీనటులందరికీ అభినందనలు తెలియజేశారు. తెరపై కనిపించే నటీనటులే కాదు, సినిమా కోసం కష్టపడిన టెక్నీషియన్స్, నిర్మాతలు కూడా ప్రశంసలకు అర్హులని చెప్పారు. అయితే అల్లు అర్జున్ పోస్ట్ లో మరో ముఖ్యమైన అంశం దర్శకుడు బుచ్చిబాబు సానాపై చేసిన ప్రశంసలు. ప్రతి పాత్రను ఎలివేట్ చేస్తూనే రామ్ చరణ్ పాత్రను మరింత ఎత్తుకు తీసుకెళ్లినందుకు దర్శకుడికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఒక హీరోని మాత్రమే కాకుండా మొత్తం కథలోని పాత్రలన్నింటినీ బలంగా నిలబెట్టడం దర్శకుడి విజయమని ఆయన సందేశం ద్వారా స్పష్టమైంది. సాధారణంగా అభిమానుల మధ్య పోలికలు, ఫ్యాన్ వార్స్ ఎక్కువగా కన్పిస్తాయి. కానీ ఒక స్టార్ హీరో మరో స్టార్ హీరో పనితీరును ఇంత ఓపెన్ గా ప్రశంసించడం అరుదుగా జరుగుతుంది. అందుకే అల్లు అర్జున్ పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది.

# దేశ విభజన ఆధారంగా .. బట్వారా 1947

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా చిత్రం నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటివరకు 'లాహోర్ 1947' అనే వర్కింగ్ టైటిల్‌తో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా పేరును అధికారికంగా 'బట్వారా 1947' గా మారుస్తూ చిత్ర బృందం సరికొత్త మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరితమైన చిత్రాన్ని స్వాతంత్య్ర దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.




# కింగ్ నాగార్జున వందో మూవీ

**సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేస్తున్న చిత్ర బృందం**

టాలీవుడ్ కింగ్ నాగార్జున నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. 'కింగ్ 100', 'లాటరీ కింగ్' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ మైల్‌స్టోన్ చిత్రానికి రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా దూసుకుపోతోంది. అంతేకాదు.. షూటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్టుగా టాక్. త్వరలోనే చిత్రీకరణ మొత్తాన్ని పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనుల పై ఫోకస్ చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తోందట. మరోవైపు మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతోందట. వచ్చే నెలలోనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసే ఆలోచనలో కూడా ఉన్నారట. అంతేకాదు.. అన్ని అనుకున్నట్టుగా జరిగితే ఈ ల్యాండ్‌మార్క్ మూవీని 2026 దసరా పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. కానీ, ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్మెంట్ మాత్రం రాలేదు. అసలు ఈ సినిమా టైటిల్ ఏంటి? నాగార్జున లుక్ ఎలా ఉంటుంది? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అభిమానులు. కానీ, కింగ్ ఈసారి అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా సీనియర్ స్టార్ హీరోయిన్ టబు కీలక పాత్ర పోషిస్తుండగా.. యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ కలిపి తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసే ఛాన్స్ ఉంది. మరి కింగ్ 100తో నాగార్జున ఎలా ఎ÷-లాన్ చేస్తున్నాడో చూడాలి.



# పెంపుడు కుక్కను మట్టుపెట్టిన దుర్మార్గుడు

## కన్నీరు పెట్టుకున్న నటి మంజరి ఫడ్నిస్

తన అపార్ట్‌మెంట్‌లో ఉండే ఓ కుక్కను విచక్షణారహితంగా కొట్టి చంపేశారంటూ నటి మంజరి ఫడ్నిస్ ఆవేదన వ్యక్తంచేశారు. 2019లో తమ సొసైటీలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ కుక్కని వదిలివెళ్లారని అప్పటినుంచి దాన్ని 'మైకీ' అని పేరుతో తామే పెంచుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల నుంచి అది కనిపించకపోవడంతో పోస్టర్లు కూడా వేసి వెతికామని.. ఈ క్రమంలో సొసైటీకి చెందిన ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా దాన్ని కొట్టి చంపేశారని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలా ఎవరూ జంతుహింసకు పాల్పడకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని మంజరి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆమె విలపిస్తూ మాట్లాడుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. భూమి పెడ్నేకర్‌తో పాటు మరికొందరు దీనిపై స్పందించారు. 2004లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మంజరి అల్లరి నరేశ్‌తో కలిసి 'సిద్ధూ ఫ్రమ్ శ్రీకాకుళం', 'శుభప్రదం' చిత్రాల్లో నటించారు. అలాగే ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'శక్తి'లో గౌరిగా కనిపించారు.

# విడుదలకు రెడీ అవుతున్న అఖిల్ లెనిన్

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ఊరమాస్ గ్రామీణ ప్రేమకథా చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. టీజర్, సాంగ్స్ రిలీజ్ అయ్యాక ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీ-రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ సర్కిల్స్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ క్లోజ్ అయినట్లు టాక్. రాయలసీమ మినహాయించి మిగిలిన ఆంధ్ర రీజియన్ థియేట్రికల్ హక్కులు దాదాపు రూ. 9 కోట్ల రేషియోలో క్లోజ్ అయింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell :
7989575563, Mail:thecrimenews123@gmail.com